తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

### పడక మంచానికే పరిమితమైన రోగులకు...

# ఇంటివద్దే వైద్యం

**- ఎస్‌వి వైద్య కళాశాల వైద్యుల సేవలు - శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాల వైద్యుల - హోం బేస్డ్ పాలియేటివ్ కేర్ సేవల ప్రారంభం**

తిరుపతి హెల్త్, జూలై 10 ప్రభాతవార్త: శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రభు, రుయా ఆసుపత్రి ఆదనపు వైద్య విద్య సంచాలకులు, సూపరింటెండెంట్ డాక్టర్ మనోహర్ ప్రోత్సాహ, సహకారాలతో హోం బేస్డ్ పాలియేటివ్ కేర్ సేవలు కొద్దికాలంగా ప్రారంభించ బడ్డాయి. పాలియేటివ్ కేర్ యూనిట్ ఆధ్వర్యంలో ఆసుపత్రికి రావడానికి వీలులేని దీర్ఘకాలిక, తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్న రోగులకు వారి ఇంటి వద్దనే వైద్య సేవలు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. రోగి లేదా కుటుంబ సభ్యుల నుండి ఫోన్ కాల్ అందిన వెంటనే పాలియేటివ్ కేర్ బృందం రోగి ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్స, నొప్పి నివారణ, మందుల వినియోగంపై సూచనలు, అలాగే అందుబాటులో ఉన్న వైద్య మరియు సామాజిక సంక్షేమ సేవల గురించి ఈ వైద్య బృందం అవగాహన కల్పిస్తోంది అని పాలేటీవ్ కేర్ నోడల్ అధికారి డాక్టర్ రోజా రమణి తెలిపారు. ఈ హోం బేస్డ్ పాలియేటివ్ కేర్ కార్యక్రమం ద్వారా ఆసుపత్రికి రాలేని రోగులకు వారి ఇంటి వద్దే నాణ్యమైన, గౌరవప్రదమైన మరియు సమగ్ర వైద్య సేవలు అందించడం ప్రధాన లక్ష్యమని, ఆ దిశగా వైద్య బృందం కృషి చేస్తుందని ఎస్‌విఆర్‌ఆర్ జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మనోహర్ హామి ఇచ్చారు. ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్న ఎస్వీ వైద్య కళాశాల వైద్య బృందానికి ఆ ఇంటి వారందరూ కృతజ్ఞతలు తెలిపారు. మెరుగైన వైద్యం అందుతుందని రోగి త్వరగా కోలుకుంటారని మాకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్న వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలియేటివ్ కేర్ బృంద వైద్యులు డాక్టర్ రోజారామణి, డాక్టర్ వికాస్, డాక్టర్ అన్వేష్, రోటరీ క్లబ్ ప్రతినిధి టెంకాయల దామోదర్, పాల్గొని రోగిని పరామర్శించి, అవసరమైన వైద్య సేవలను అందించారు.

### సత్యవేడు టీడీపీలో...

# అంతర్గత పోరు

సత్యవేడు, జూలై 10 ప్రభాతవార్త: సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ అంతర్గత పోరు రాజకీయాలు రోజు రోజుకు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఒక వైపు సస్పెన్షన్‌కు గురైన ఎమ్మెల్యేపై చర్యలు ఎత్తివేస్తారనే ప్రచారం జరుగుతుండగా, మరో వైపు పార్టీ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి పార్టీ కోసం కష్ట కాలంలో శ్రమించిన సీనియర్ నాయకులు, కరుడుగట్టిన కార్యకర్తలను సమన్వయం చేయడంలో విఫలమవుతున్నారనే అసంతృప్తి కేడర్‌లో వ్యక్తమవుతోందనే చర్చ సాగుతోంది. పార్టీ అధికారంలో లేని సమయంలో జెండాను భుజాన వేసుకుని పనిచేసిన కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత దక్కకపోగా, ఇటీవల ఇతర పార్టీల నుంచి ముఖ్యంగా వైసీపీ నుంచి వచ్చిన నాయకులకు అధిక ప్రాధాన్యం లభిస్తోందనే భావన కేడర్‌లో పెరుగుతోందని పలువురు కార్యకర్తలు అభిప్రాయ పడుతున్నారు. దీంతో ఎన్నో సంవత్సరాలుగా పార్టీకి అండగా నిలిచిన సీనియర్‌నాయకులు, కార్యకర్తలు నిరాశకు గురై తిరిగి సస్పెన్షన్‌కు గురైన ఎమ్మెల్యే వర్గం వైపు మొగ్గు చూపుతున్నారనే రాజకీయ విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఈ పరిణామాలు రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉందనే ఆందోళన కూడా పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. కేడర్‌ని ఏకతాటిపైకి తీసుకురావాల్సిన సమయంలో అంతర్గత విబేధాలు మరింత పెరిగితే పార్టీకి నష్టం కలిగే అవకాశం ఉందని కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. సత్యవేడు నియోజకవర్గంలో చోటు చేసుకుంటున్న ఈ పరిణామాలపై పార్టీ అధిష్టానం ఎప్పుడు దృష్టి సారిస్తుంది? కేడర్ అసంతృప్తికి ఎప్పుడు చెక్ పెడుతుంది.? పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు న్యాయం జరిగేలా ఎలాంటి చర్యలు తీసుకుంటుంది అనే ప్రశ్నలు ప్రస్తుతం టీడీపీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారాయి. అదే విధంగా సస్పెన్షన్‌కు గురైన ఎమ్మెల్యేపై పార్టీ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది. సస్పెన్షన్‌ను ఎత్తివేస్తుందా..? లేక ప్రస్తుత పార్టీ ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ అందరిని సమన్వయం చేసుకుంటూ కేడర్‌ని ఒకే తాటిపైకి తీసుకు వెళ్ళగలరా...? అనే ప్రశ్నలు కూడా కార్యకర్తల్లో చర్చకు దారి తీస్తున్నాయి. ఈ సందిగ్ధ పరిస్థితికి పార్టీ అధిష్టానం త్వరలోనే స్పష్టత ఇచ్చి, సత్యవేడు నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసే నిర్ణయం తీసుకోవాలని కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### స్థానిక ఎన్నికల ఊసుతో...

# కూటమికి కత్తిమీద సామేనా?

**-దూకుడు పెంచిన వైసిపి -టిడిపిలో అంతర్గత అసంతృప్తి!**

ప్రభాతవార్త-తిరుపతి

రాష్ట్రంలో నవంబర్‌లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ప్రకటించడంతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీ స్థానాల కోసం అధికార కూటమి, ప్రతిపక్ష వైసిపి ఇప్పటి నుంచే వ్యూహాలకు పదును పెడుతున్నాయి. అయితే ఈ ఎన్నికలు అధికార కూటమికి, ముఖ్యంగా తెలుగుదేశం పార్టీకి అంత సులభం కాదనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది.



2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తర్వాత స్థానిక ఎన్నికల్లోనూ సునాయాసంగా గెలుస్తామని భావించిన కూటమి నాయకత్వం, ప్రస్తుతం మారుతున్న రాజకీయ పరిస్థితులను చూసి అప్రమత్తమవుతోంది. గ్రామీణ స్థాయిలో వైసిపి కార్యకలాపాలు మళ్లీ వేగం పుంజుకోవడం, కేడర్‌లో చైతన్యం పెరగడం అధికార పక్షానికి కొత్త సవాల్‌గా మారుతున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వైసిపి కూడా స్థానిక ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికల ఫలితాల నుంచి గుణపాఠాలు నేర్చుకున్న ఆయన పార్టీని అట్టడుగు స్థాయి నుంచి పునర్వ్యవస్థీకరించే పనిలో నిమగ్నమయ్యారు. నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమైందని, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, శాంతిభద్రతల సమస్యలు, పాలనలో లోపాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జగన్ పార్టీకి స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. ఇందుకోసం ప్రత్యేక ప్రచార పుస్తకాలను కూడా సిద్ధం చేసినట్లు చెబుతున్నారు. ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, బోగస్ ఓట్ల నమోదు, ఓట్ల తొలగింపులపై అప్రమత్తంగా ఉండాలని ఆయన కేడర్‌కు సూచించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

**-టిడిపిలో అంతర్మధనం:**

ఇదిలా ఉండగా, అధికారంలోకి వచ్చిన తర్వాత టిడిపి సీనియర్ నాయకులు, పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేసిన కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదన్న అసంతృప్తి పెరుగుతోందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా వైసిపి నుంచి వచ్చిన నాయకులకు కీలక పదవులు ఇవ్వడం పాత టిడిపి నాయకుల్లో అసహనానికి కారణమవుతోందని అంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంత జిల్లా చిత్తూరులోనే ఈ అసంతృప్తి బహిర్గతమవుతోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. చిత్తూరు పార్లమెంటు కమిటీ అధ్యక్షునిగా షణ్ముగం రెడ్డి నియామకం, తిరుపతి పార్లమెంటు అధ్యక్షురాలు పనబాక లక్ష్మి పనితీరుపై వస్తున్న విమర్శలు, టిడిపిలో చేరిన సి. దివాకర్ రెడ్డికి వరుస పదవులు ఇవ్వడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే సత్యవేడు, చంద్రగిరి, జిడి నెల్లూరు, పూతలపట్టు వంటి నియోజకవర్గాల్లో స్థానిక స్థాయిలో విభేదాలు, వర్గపోరు కొనసాగుతున్నట్లు సమాచారం. మరోవైపు వైసిపి నేతలు భూమన కరుణాకర్ రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కె. నారాయణస్వామి, ఆర్.కె. రోజా తదితరులు ప్రభుత్వంపై విమర్శలను మరింత తీవ్రతరం చేస్తూ పార్టీ కార్యకర్తల్లో ధైర్యం నింపే ప్రయత్నం చేస్తున్నారు. ఈ పరిస్థితులన్నింటినీ బట్టి చూస్తే, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు కూటమికి కేవలం ప్రతిష్ఠాత్మక పోరే కాకుండా నిజమైన రాజకీయ పరీక్షగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**- వేతనాలు పెంచే వరకు పోరాడుతామని నినాదాలు**
**- నవ చేతన్ యాప్ రద్దు చేయాలని డిమాండ్**
**- కలెక్టరేట్‌లోనికి వెళ్ళకుండా అడ్డుకున్న పోలీసులు**

# కదం తొక్కిన అంగన్‌వాడీలు

చిత్తూరు, జులై 10 ప్రభాతవార్త: తమ న్యాయపరమైన కోరికలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కొర్కెల దినోత్సవం పురస్కరించుకుని ఆల్ ఇండియా కమిటీ పిలుపు మేరకు జిల్లాలోని అంగన్‌వాడీ కార్యకర్తలు శుక్రవారం జిల్లా కేంద్రం చిత్తూరులో కదం తొక్కారు. తమ డిమాండ్లను సత్వరం పరిశీలించి పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. కలెక్టరేట్ లోపలికి చొచ్చుకు వెళ్ళడానికి ప్రయత్నించిన అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడంతో కొంత ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాను ఉద్దేశించి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం గత 11 సంవత్సరాలుగా అంగన్‌వాడీలకు ఒక్క రూపాయి వేతనం పెంచకుండా వారితో వెట్టిచాకిరి చేయించుకుంటోదని ధ్వజమెత్తారు. ఐసిడిఎస్ ఏర్పాటై 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలను ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు భారమైన నవ చేతన్ యాప్‌ను సత్వరం రద్దు చేసి తమపై జరుగుతున్న వేధింపులకు ఫుల్‌స్టాప్ పెట్టాలన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రతిపక్షంలో వున్న సమయంలో అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని 42 రోజుల పాటు సమ్మె నిర్వహిస్తే అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సిఎం చంద్రబాబునాయుడు అంగన్‌వాడీల నిర్వహిస్తున్న ధర్నా శిబిరాల వద్దకు వచ్చి మద్దుతు ప్రకటించి, కుప్పంలో జరిగిన బహిరంగ సభలో తాము అధికారంలోకి వస్తే అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరిస్తామని ప్రకటించడంతో అంగన్‌వాడీలు గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వంను ఓట్లు వేస్తే అధికారం చేజిక్కించుకుని 2 సంవత్సరాలు పూర్తయినా ఒక్క సమస్యను పరిష్కరించకపోవడం అన్యాయమన్నారు. ధర్నా అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్స్ యూనియన్ నాయకులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తే జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు లలిత, ప్రధాన కార్యదర్శి షకీల, సిఐటియు గౌరవ అధ్యక్ష, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ, గిరిధర్ గుప్తాలు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు సుజిని, మమత, లక్ష్మీ, రాధిక, పద్మ, పద్మమ్మ, అనిత, శ్యామలమ్మ, మమత, ధనకోటి, వరలక్ష్మీ, భాను, శోభారాణి, జమున, భారతిలతో పాటు పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట సమస్యలు పరిష్కరించాలని కదం తొక్కిన అంగన్‌వాడీ కార్యకర్తలు

### గుడ్ మార్నింగ్ పెళ్లకూరును అడ్డుకున్న...

# తెలుగు తమ్ముళ్లు

**మండల ప్రజలకు నువ్వేం చేసావంటే, నువ్వేం చేసావని ఒకరినొకరు వాదనలు**

పెళ్లకూరు, జూలై 10 ప్రభాతవార్త: వైసీపీ నాయకులు, మాజీ ఎన్డిడిసిబి చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఇటీవల కలవకూరు ఇసుకరీచ్ వద్ద అక్కడ పనిచేస్తున్న సిబ్బందిపై దాడి చేశారన్న కేసు తో పాటు తరువాత పలు కేసుల్లో నెల్లూరు సబ్ జైల్లో సుమారు 90 రోజులు పాటు రిమాండ్‌లో ఉండి విడుదలైన సంగతి తెలిసిందే. తను జైల్లో ఉన్న సందర్భంలో తనకు వెన్నంటూ ఉండి సంఘీభావం తెలిపిన ప్రజలను, వైసీపీ కార్యకర్తలను కలిసి కృతజ్ఞతలు తెలుపుతూ వైసిపి పార్టీని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో గుడ్ మార్నింగ్ పెళ్లకూరు అనే కార్యక్రమం ద్వారా ప్రతిరోజు మండలంలోని ఏదో ఒక గ్రామం ప్రజలను కలుస్తూ వైసిపి పార్టీని బలోపేతం చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శుక్రవారం కొత్తూరు గ్రామంలో గుడ్ మార్నింగ్ పెళ్లకూరు పాల్గొన్న కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిని మండల తెదేపా నాయకులు అడ్డుకోవడంతో ఇరు పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ ఘర్షణ వాతావరణం ఎటు దారితీస్తుందోనని అక్కడున్న ప్రజలు తీవ్ర భయాందోళనలకు లోన య్యారు. రెండు పార్టీల నాయకులు మండల ప్రజలకు నువ్వేం చేసావంటే, నువ్వేం చేసావని ఒకరినొకరు వాదించుకుంటూ నెట్టుకోవడంతో ఒకానొక దశలో పెద్ద గొడవలు జరుగుతాయని ప్రజలు భయపడ్డారు. తర్వాత అక్కడున్న గ్రామస్తులు సర్ది చెప్పడంతో గొడవ సద్దుమణిగినట్లయ్యింది.

**- గుడ్ మార్నింగ్ పెళ్ళకూరు అడ్డుకోవడంపై తేదేపా వాదన:**

కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఇటీవల పలు కేసుల్లో ముద్దాయిగా నెల్లూరు సబ్జైల్లో రిమాండ్‌లో ఉండి ఇప్పుడు బయటకు వచ్చి కూటమి ప్రభుత్వంపై అక్రమంగా నన్ను జైల్లో పెట్టారంటూ ప్రజల్లో అబద్ధపు ప్రచారాలు చేస్తూ రాజకీయ దురుద్దేశంతో తన స్వలాభం కోసం జగన్మోహన్ రెడ్డి మెప్పుకోసం కూటమి ప్రభుత్వంపై బురద చల్లడమే కాకుండా మా నాయకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహాన్ని చిల్లకూరు గ్రామంలో ప్రతిష్టించాలని తెలుగుదేశం పార్టీ భూమి పూజ చేయగా దానికి వ్యతిరేకంగా ఎన్టీఆర్ విగ్రహాన్ని చిల్లకూరులో ఏర్పాటు చేయడానికి వీలులేదని ఆటంక పరచడం ఏమాత్రం మంచిది కాదని ఇలాంటి కార్యక్రమాలను మా కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు కచ్చితంగా అడ్డుకుని తీరుతామన్నారు.

**వైసీపీ నాయకులు వాదన:**

మా నాయకుడు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిని అక్రమంగా పలు కేసుల్లో ఇరికించి జైల్లో పెట్టడమే కాకుండా ఇప్పుడు మళ్లీ అనవసరంగా విద్వేషాలు సృష్టించి మళ్లీ జైల్లో పెట్టాలని మాపై కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారని, మా నాయకుడు సత్యనారాయణరెడ్డి గ్రామాల్లో ప్రజల్లో తిరుగుతూ మా పార్టీని బలోపేతం చేసుకోవడం తప్ప ఏ పార్టీ గురించి గానీ ప్రభుత్వం గురించి గానీ ఎలాంటి విమర్శలు చేయడం లేదని ప్రజల్లో మా నాయకుడికి ఉన్న విశేష ఆదరణ చూసి ఓర్వలేకనే ఇలాంటి అడ్డుకునే కార్యక్రమాలు చేపడుతున్నారని వైసీపీ నాయకులు వాపోయారు.



గుడ్ మార్నింగ్ కార్యక్రమాన్ని అడ్డుకున్న తెలుగు తమ్ముళ్ళు

# 2047 నాటికి వికసిత్ భారత్ సాధనకు పరుగులు

**-ఐసర్‌లో 7వ స్నాతకోత్సవం...విద్యార్థుల్లో సంబరం**

ఏర్పేడు,జూలై 10 ప్రభాతవార్త: సాంకేతిక నైపుణ్య రంగాల్లో భారత దేశం పరుగులు తీస్తుందని 2047 నాటికి వికసిత్ భారత సాధన దిశగా పరుగులు తీస్తుందని ప్రముఖ రక్షణ ఏరోస్పేస్ శాస్త్రవేత్త,భారత ప్రభుత్వ జాతీయ భద్రతా సలహామండలి సభ్యులు డాక్టర్ జి.సతీష్ అన్నారు. శుక్రవారం ఐసర్‌లో ఏడవ స్నాతకోత్సవం సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్యఅతిధిగా డాక్టర్ జి.సతీష్ హాజరయ్యారు. సభకు డైరెక్టర్ సంతాన భట్టాచార్య అధ్యక్షత వహించగా ముఖ్యఅతిధిగా ఎపిజియస్‌టి కార్యదర్శి పురుషోత్తం, ఐఐటి డైరెక్టర్ సత్యనారాయణలు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఐసర్ క్యాంపస్ సంబరాలతో కళ కళ లాడింది.డిగ్రీలు తీసుకునే విద్యార్థుల ఉత్సాహంతో నిండింది.ఇక్కడ చదివి జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులకు సత్కరించారు. 214 మంది విద్యార్థులు డిగ్రీలను అందుకున్నారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ వ్యూహాత్మక,స్వదేశీ సాంకేతిక సామర్థ్యాలను నిర్మించటంలో భారత దేశానికి ఉన్న అనుభవాన్ని ఉదహరిస్తూ, దేశ సాంకేతిక సామర్థ్యాలను బలోపేతం చేయటంలో శాస్త్రీయ నైపుణ్యం ఆవిష్కరణ,నిరంతర పరిశోధనల ప్రాముఖ్యతను డాక్టర్ రెడ్డి నొక్కి చెప్పారు. రిజిస్ట్రార్ కోష్లి ఇంద్రజీత్ సింగ్ వందన సమర్పణతో కార్యక్రమాలు ముగిసాయి.

**ఉత్తమ విద్యార్థి మనోజ్:** నందనా మనోజ్ తన విద్యాభ్యాసంతో పాటు క్యాంపస్ కార్యకలాపాలకు చేసిన విశేష కృషికి గుర్తింపుగా, ప్రోగ్రామ్, 2026 సంవత్సరపు ఉత్తమ విద్యార్థి క్యాంపస్ కార్యకలాపాల అవార్డును అందుకున్నారు. ఐదుగురు విద్యార్థులు బీఎస్ ఎంఎస్ ప్రోగ్రామ్‌ను డిస్టింక్షన్‌తో పూర్తి చేయగా, ఒక విద్యార్థి బీఎస్ ప్రోగ్రామ్‌ను డిస్టింక్షన్‌తో పూర్తి చేశాడు. అధికారిక స్నాతకోత్సవ పుస్తకంలో అవార్డుల విభాగాలు, డిస్టింక్షన్ ప్రమాణాలు మరియు అవార్డు గ్రహీతల వివరాలు నమోదు చేయబడ్డాయి. నేచర్ ఇండెక్స్ 2026లో ఐఐఎస్‌ఈఆర్ తిరుపతి జాతీయంగా 20వ స్థానానికి ఎగబాకింది. 2026 బీఎస్‌ఎంఎస్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లో అత్యుత్తమ విద్యా ప్రతిభ క్యాంపస్ సేవలకు గుర్తింపుగా, ఐఐఎస్‌ఈఆర్ తిరుపతి ఏడవ వార్షిక స్నాతకోత్సవంలో నలుగురు విద్యార్థులకు ఇన్‌స్టిట్యూట్ అవార్డులను ప్రదానం చేశారు.

**ఇన్స్టిట్యూట్ గోల్డ్ మెడల్ :** సయ్యద్ సాహిల్ సి.బిఎస్‌ఎంఎస్ ప్రోగ్రామ్ అంతటా అద్భుతమైన అకడమిక్ రికార్డును కలిగి ఉన్నారు. ఫిజిక్స్‌లో స్పెషలైజేషన్‌తో బిఎస్ ఎమ్మెస్ 2021 బ్యాచ్‌లో (10 పాయింట్ల స్కేల్‌పై) 9.8 అత్యధిక దిబిశితి సాధించారు. ఆయన మొదటి మరియు రెండవ సెమిస్టర్‌లలో సిఎన్‌ఆర్ రావు ఫౌండేషన్ డే అవార్డును, ఆ తర్వాతి సెమిస్టర్‌లలో అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు. ఆయన డాక్టర్ సంబుద్ధ సన్యాల్ పర్యవేక్షణలో "క్రమరహిత వ్యవస్థలలో క్వాంటం డైనమిక్స్ పై తన ఎంఎస్ థీసిస్‌ను, మరియు డాక్టర్ కబీర్ రామోలా మార్గదర్శకత్వంలో అమూర్త వ్యవస్థలలో వాస్తవ మరియు బల స్థలంలో ద్వంద్వత్వం (2023) పై ఒక వేసవి ప్రాజెక్ట్‌ను పూర్తి చేశారు.అతను నేషనల్ అండర్‌గ్రాడ్యుయేట్ ఫిజిక్స్ కాన్ఫరెన్స్ (2025) మరియు క్వాంటం కండెన్స్‌డ్ మ్యాటర్ థియరీ కోసం యంగ్ ఇన్వెస్టిగేటర్స్ మీట్ (2025) లలో పాల్గొని, డి.ఎస్.టి ఇన్స్పైర్ పథకం కింద ఫెలోషిప్‌ను అందుకున్నాడు. అతను బాసెల్ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేయాలని యోచిస్తున్నాడు.

**సిల్వర్ మెడల్ అందుకున్న రేయిస్‌టిఆర్:**

బిఎస్‌ఎంఎస్ ప్రోగ్రామ్, 2026 జీవశాస్త్రం రాయస్ టి ఆర్ పట్టభద్రులలో అత్యధికంగా 9.6 సీజీపా తో బయాలజీలో ప్రత్యేకతతో బిఎస్ ఎమ్మెస్ ప్రోగ్రామ్‌ను పూర్తి చేసి, మూడవ, ఐదవ సెమిస్టర్‌లలో అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు. అతని వేసవి ప్రాజెక్ట్ స్కై ఐలాండ్ పక్షుల జనాభా జన్యుశాస్త్రం మరియు జనాభా చరిత్రను పరిశీలించింది. అతను డాక్టర్ రాబిన్ వి వి పర్యవేక్షణలో మున్నార్, కోడైకనాల్‌లలో పట్టణీకరణ గ్రేడియంట్ వెంబడి వెక్టర్ వైవిధ్యాన్ని అంచనా వేయడానికి దోమలను పట్టుకోవడంపై ఇంటర్న్‌షిప్ పూర్తి చేశాడు. "పశ్చిమ కనుమలకు మాత్రమే పరిమితమైన ఒక పక్షి యొక్క జనాభా చరిత్ర ద్వారా భూభాగ మార్పుల ప్రభావాలను పునరుద్ధరించడం అనే అతని ఎంఎస్ థీసిస్‌కు ఐఐఎస్‌ఈఆర్ తిరుపతిలో డాక్టర్ రాబిన్ వివి కూడా పర్యవేక్షణ వహించారు. ఆయన ఐజర్ తిరుపతిలో పీహెచ్‌డీ చేయాలని యోచిస్తున్నారు.

**సిల్వర్ మెడల్ అందుకున్న సిద్దాంత్‌రే:** బిఎస్ ఎమ్మెస్ ప్రోగ్రామ్, 2026 భూమి మరియు వాతావరణ శాస్త్రం సిద్ధాంత్ రే, భూమి మరియు వాతావరణ శాస్త్రంలో ప్రత్యేకతతో పట్టభద్రులలో అత్యధికంగా 9.1 సీజీపా తో బిఎస్ ఎమ్మెస్ ప్రోగ్రామ్‌ను పూర్తి చేశారు.ఆయన ఇన్‌స్టిట్యూట్ క్రీడా సమాజంలో చురుకైన సభ్యుడిగా ఉంటూ, క్రికెట్ జట్టుకు (ఐటీసీల్ 2025) ప్రాతినిధ్యం వహించారు. అలాగే జాతీయ క్రీడా దినోత్సవం 2025 మరియు ఐఐటి తిరుపతి నిర్వహించిన సంయోగ లీగ్‌లో పాల్గొన్నారు. ఆయన డీఎస్టి ఇన్స్పైర్ పథకం కింద ఫెలోషిప్‌ను అందుకున్నారు. ఆగ్నేయ భారతదేశంలోని యెర్పేడు అనే ఉష్ణమండల కేంద్రంపై వివిధ రకాల మేఘాల సమయంలో ఉపరితల విద్యుత్ క్షేత్రంలో హెచ్చుతగ్గులు అనే అతని ఎంఎస్ థీసిస్‌కు డాక్టర్ సాయిక్రాంతి కె.పర్యవేక్షణ వహించారు.



ఉత్తమ విద్యార్థి అవార్డు అందుకుంటున్న విద్యార్థులు

# 80శాతం డిజిటలైజేషన్ పూర్తి

**- పారదర్శకంగా ఓటర్ల సవరణ జాబితా ప్రక్రియ**
**- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్**

చిత్తూరు, జులై 10 ప్రభాతవార్త: జిల్లాలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం వేగంగా కొనసాగుతున్నదని, ఇప్పటికే జిల్లాలో ఓటర్ల డిజిటలైజేషన్ ప్రక్రియ 80 శాతం పూర్తయ్యిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్ లోని సమావేశభవనంలో శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓటర్ల ప్రత్యేక సవరణ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకులు, బూత్ స్థాయి అధికారులు సమన్వయంతో అత్యంత పారదర్శకంగా ప్రత్యేక సంక్షిప్త ఓటరు సవరణ జాబితా ప్రక్రియ నిర్వహించాలని జులై 14వ తేదీలోపు డిజిటలైజేషన్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయడమే లక్ష్యంగా అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. అధికారులు ఓటరు జాబితాలోని ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారాలు అందించడం జరిగిందని, ఈ ఎన్యుమరేషన్ ఫారాలను వివరాలతో నింపి బిఎల్‌ఓలకు అందించాలన్నారు. అలా అందజేయని వారి వివరాలు ఈ నెల 21వ తేదీన విడుదల చేసే డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో వారి పేర్లు వుండవని స్పష్టం చేశారు. ఓటు హక్కు లేని వారు మళ్ళీ ఫారం-6 ద్వారా సంబంధిత ధృవీకరణ పత్రాలతో కొత్తగా ఓటు నమోదు చేసుకోవాల్సి వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.బాలసుబ్రమణ్యం, జిల్లా బిజెపి కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మాజీ అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్, వైకాపా నాయకులు విజయసింహారెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్‌బాబు, సంబంధిత అధికారులు, ఎలక్షన్ డిటి తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్

## జిల్లాలో పలువురు ఎస్ఐలకు పోస్టింగ్‌లు

తిరుపతి,జులై 10ప్రభాతవార్త: తిరుపతి జిల్లాలో పరిపాలన పరంగా పలువురు ఎస్ఐలకు ఆయా పోలీస్‌స్టేషన్‌లకు నియమిస్తూ జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఉత్తర్వులు జారీచేశారు. శుక్రవారం సాయంత్రం విఆర్‌లో ఉన్న తొమ్మిదిమంది ఎస్ఐలకు ఈ పోస్టింగ్‌లు లభించాయి. విఆర్‌లో ఉన్న ఎస్ఐలు పి.సుమతిని తిరుపతి ఈస్ట్‌కు, ఎం.ఆరుణ చంద్రగిరి, బి.హల్లీయమ్మ తిరూచానూరుకు, ఎ.నారాయణమూర్తి అలిపిరికి, కె.రఘురామ్ తిరుపతి క్రైమ్‌కు, టి.శేషగిరిరావు తిరుపతి ఈస్ట్‌కు, డి.సురేశ్‌బాబు నాయుడుపేట, పి.శంకరయ్య సూళ్ళూరుపేటకు, ఎ.జయస్వాములు సామాజిక మాధ్యమంకు పోస్టింగ్ ఇచ్చారు. వీరంతా వెంటనే ఆయా స్థానాల్లో పోస్టింగ్‌ల్లో చేరాలని ఎస్పీ తెలిపారు.

**-ఈస్ట్ ఎస్ఐగా సుమతి :**

ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లోఎస్ఐగా పి.సుమతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో అర్జీదారులకు సకాలంలో న్యాయం చేయడంతో పాటు శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని ఎస్ఐ సుమతి తెలిపారు. అనంతరం మర్యాదపూర్వకంగా జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు,తిరుపతి డిఎస్పి భక్తవత్సలం, సీఐ శ్రీనివాసులను కలిశారు. ఎస్ఐ సుమతిని పలువురు అభినందించారు.



11 -7Pg9th cheli 1:11 -7Pg9th cheli 1.qxd 7/10/2026 10:32 PM Page 1



ఫ్యాషన్ ఫ్యాషన్

# రాజసాన అనార్కలీ






అనార్కలి గ్రాండ్‌లుక్ ఉంటుంది. మొఘలుల కాలం నాటిది! రాజనర్తకి అనార్కలీ వేసుకునేదనీ, తన పేరుమీదుగానే తీసుకొచ్చారనీ చెబుతారు. దానిమ్మ మొగ్గ అనీ అర్థమట. శతాబ్దాల నాటిదే! కానీ ఇప్పటికీ దాని రాజసం తగ్గలేదనేది వాస్తవం. అందుకే అది వేసుకుని అమ్మాయిలు నడిచొస్తోంటే అచ్చు యువరాణుల్లానే ఉంటారు. నడకకి దీటుగా పోటీపడతాయీ దుస్తులు మరి. కాబట్టే, ఆ రాయల్ లుక్. లావు, సన్నం, ఎత్తు, పొడవు, అన్న తేడాలేకుండా ఎవరికైనా నప్పుతుంది. దీనిలోనూ ఎన్ని రకాలని? దొరికే వస్త్ర రకాలకీ కొదవలేదు. ఇంకేం, స్నేహితురాళ్లు కాదు. వధువులూ తమ పెళ్లి వేడుకల్లో వీటికి ప్రాధాన్యమిస్తున్నారు. ఓ మంచి అనార్కలీ డ్రెస్, పెద్ద జుంకీలు చాలు వేడుకకి సిద్ధం. లేదు లేదు ఇంకా ప్రత్యేకంగా కనిపించాలంటే కాస్త హంగులున్న డిజైనర్ అనార్కలీ, దీన్ని ఎంచు కోవడమంటే కేవలం డ్రెస్‌ని ఎంచుకోవడంలా చూడరు ఫ్యాషనిస్టులు. సొగసుని అందిపుచ్చు కోవడం అంటారు.

# సియాచిన్‌లో శివంగి



భారత సైనిక చరిత్రలో నూతన అధ్యాయాన్ని లిఖిస్తూ కెప్టెన్ శివ చౌహాన్ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన యుద్ధ క్షేత్రమైన సియాచిన్ గ్లేసియర్‌లోని కుమార్ పోస్ట్‌లో ఆపరేషనల్ విధుల్లో నియమితులైన తొలి మహిళా అధికారిగా శివ సరికొత్త చరిత్ర సృష్టించారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కు చెందిన శివ చౌహాన్, 11 ఏళ్ల ప్రాయంలోనే తండ్రిని కోల్పోయారు. తల్లి, సోదరి అండతో అనేక సవాళ్లను అధిగమించి, తన చిన్ననాటి కలను సాకారం చేసుకునే దిశగా సైన్యంలో అడుగుపెట్టారు. 2020లో సివిల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ పూర్తి చేసిన ఆమె, సర్వీసెస్ సెలక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బి) నిర్వహించిన పరీక్షల్లో ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించారు. అనంతరం చెన్నైలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకుని, 2021 మే నెలలో కార్ప్స్ ఆఫ్ ఇంజినీర్స్‌లో అధి కారిగా నియమితులయ్యారు. కఠినమైన శిక్షణ అనంతరం 2023 జనవరి 2న కెప్టెన్ శివ చౌహాన్‌ను సుమారు 15,632 అడుగుల ఎత్తులో ఉన్న కుమార్ పోస్ట్‌లో మూడు నెలల కాలానికి నియమించారు. అక్కడ ఇంజినీరింగ్ బృందానికి నాయకత్వం వహిస్తూ, మైనస్ 40 నుంచి 50 డిగ్రీల సెల్సియస్ గడ్డకట్టే చలిలోనూ హెలిప్యాడ్‌ల నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాల కల్పన నిర్వహణ బాధ్యతలను ఆమె సమర్థవంతంగా నిర్వర్తించడంతో ఆమె మరో మెట్టుకు ఎదిగారు. సియాచిన్ వంటి అత్యంత కఠినమైన భౌగోళిక పరిస్థితుల్లో లింగభేదం లేకుండా, కేవలం ప్రతిభ మరియు దక్షత ఆధారంగానే సైన్యం కీలక బాధ్యతలు అప్పగిస్తుందనడానికి కెప్టెన్ శివ చౌహాన్ నియామకమే నిదర్శనం. వ్యక్తిగత కష్టాలను అధిగమించి దేశ సేవలో ఉన్నత శిఖరాలను అధిరోహించిన ఆమె ప్రస్థానం, రక్షణ రంగంలో స్థిరపడాల నుకునే ఎంతో మంది యువతులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. ◻

# పెరుగు



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి



మంచి బాక్టీరియా ఎక్కువగా ఉండే రిఫ్రెష్ క్రీముల ప్రోబయోటిక్ ఆహారం. ఇది పిల్లల నుంచి పెద్దల వరకు సులభంగా జీర్ణమయ్యే సంపూర్ణాహారం. దీన్ని పెరుగు, మొసారు, దధి, దహి యోగర్ట్, త్రైర్, దోయీ అని అంటారు. ఇది కేవలం ఒక గంటలో పెరుగు 91% జీర్ణ అయ్యే మంచి ఆహర పదార్థాం. పెరుగు శరీరానికి బలాన్ని, రోగ నిరోధక శక్తిని ఆకలిని, జీర్ణశక్తిని, రుచిని పెంపొందించే ఎనర్జీ బూస్టర్ అంతే గాకుండా శరీర పోషణకు మూలమైన ముఖ్యమైన ఆంటీ ఆక్సిడెంట్ అని చెప్పవచ్చు. ఇది అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్‌ని తగ్గిస్తుంది. ఇది గుండె, చర్మం, జుట్టు, జీర్ణకోశ ఆరోగ్యా నికి మంచిది. ఇది శరీర అధిక బరువుని తగ్గిస్తుంది. శరీరంలో వేడిని తగిస్తుంది. దీనిలోని మంచి బాక్టీరియా గట్‌హెల్త్‌కి మంచిది. ఇది దంతాలు ఎముకలకు బలం, శరీరంలోని అధిక షుగర్ లెవల్స్‌ని తగ్గిస్తుంది. ఇమ్యూనిటీని పెంపొందించి దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా చేస్తుంది. పెరుగులోని విటమిన్స్ మినరల్స్, కాల్షియం త్వరగా రక్తంలో కలిసేలా చేస్తాయి. ఎండవేడికి చర్మం పాడవకుండా, నగనిగలాడేలాగ చేస్తుంది. ఇది నరాలకి శక్తిని జీర్ణశక్తిని పెంపొందించే ఔషధ కారకం ఆహారం అని చెప్పవచ్చు. వేసవిలో శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుతుంది. శరీరంలో మంట, వాపుని తగిస్తుంది. నిద్ర పట్టనివారు, ఉన్మాదం ఉన్నవారు, ఫట్స్‌తో బాధపడేవారు, మాన సిక సమస్యలున్న వారిలో సెరిటోనిన్ పెరిగి నిద్రపడుతుంది సెరెయాసిస్, ఎగ్జిమా వంటి చర్మ వ్యాధులున్నవారు వాడవచ్చు రెగ్యులర్‌గా పెరుగు తీసుకుంటే అపెండిసైటిస్, ఎమిబియాసిస్, మలబద్ధకం, జ్వరం, విరేచనాలు, బహిష్ఠులు సక్రమంగా రాక పోవడం వంటి వ్యాధులు రావు. కడుపులో అల్సర్ ఉండే వారిలో, గ్యాస్ట్రిక్ ఇంటేషన్ ఉన్న, హైపర్ అసిడిటీ ఉన్నప్పుడు పెరుగు జీర్ణ అయ్యేటప్పుడు అది సిఓ2 నీరుగా మారడం వల్ల హైపర్ అసిడిటీ, అల్సర్, గ్యాస్ తగ్గుతుంది. పెప్సిన్ ఎంజైమ్స్ విడుదల వల్ల ఆహారం జీర్ణమవుతుంది పెరుగు ఒత్తిడి, ఆందోళ నకు కారణమయ్యే హార్మోన్ల స్థాయి తగ్గిస్తుంది. గర్భిణీలు, కామెర్లు, హైపటైటిస్, లివర్ వ్యాధులు న్నవారు, ఆంటి బయాటిక్స్, హేపటైటిస్, లివర్ వ్యాధులున్న వారు, ఆంటి బయా టిక్స్, దీర్ఘకాలిక వ్యాఉలకి మందులు వాడే వారు పెరుగు ని వాడడం వల్ల దానిలోని ఇన్‌ఫ్లమేటరీ గుణాలు, మంటని తగ్గించి శరీరాన్ని చల్లగా ఉంచుతాయి. జలుబుగా ఉన్నప్పుడు మూత్ర సంబంధ రోగాల్లో, జిగురు విరేచలున్నప్పు పెరుగు వాడడం మంచది. ఇది జీర్ణ వ్యవస్థని పటిష్టం చేస్తుంది. పెరుగు ఎక్కువగా తీసుకుంటే బరువు పెరుగు తారు. దీనివల్ల మందకొడి తనం, స్థూల కాయం, ఇన్‌ఫ్లమేషన్, రక్తస్రావ రుగ్మతలు, కఫం, వాతం ఎక్కువై కుష్టు, గోధుమ రంగు మచ్చలు, రక్తహీనత మలబదనదకం, వస్తుంది. పెరుగులోని బయోజెనిక్ ఆమైన్ వల్ల తలనొప్పి, మైగ్రేన్ ఎక్కువవుతుంది. కీళ్ళనొప్పులు వస్తాయి. గెలాక్టోజ్ అనే రసాయన సమ్మేళనం వల్ల అరుదుగా అండాశయ కేన్సర్ వచ్చే అవకాశం ఉంది. చలువచేసే పెరుగులో వేడి కల్గించే ఉల్లిగడ్డ ముక్కలు వేసుకొని తింటే ఎలర్జీలు, దద్దుర్లు, జీర్ణకోశ సమస్యలు వాంతులు, తామర, సోంయాస్ వంటి వ్యాధులు వస్తాయి. అలాగే పాలు, పెరుగు కలిపికాని, వెంటనేకాని తిన్నా ఎసిడిటీ, అజీర్తి, అతిసారం, కడుపునొప్పి అనీజీ ఉంటుంది. పెరుగు తిన్న వెంటనే మినపప్పుతో చేసిన పదార్థాలు, నూనె, నెయ్యి, వెన్న అధికంగా ఉండే ఆహార పదార్థాలు తిన్న జీర్ణకోశ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ◻

# శ్రీరామరాజ్యం

త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడి పరిపాలనా కాలంలో ధర్మం నాలుగు పాదాల మీద నడిచేదంటారు. ఆ విషయాన్ని బలపరిచే ఉదంతాలు అనేకం రామాయణ మహాకావ్యంలో చూస్తాం. ఆదికవి వాల్మీకి విరచిత సంక్షిప్త రామాయణంలో పుత్ర మరణం కించి ద్రక్ష్యం పురుషాఃక్వచిత్ అన్నారు. రామరాజ్యంలో తండ్రి కంటే ముందు పుత్రులు మరణించడం అన్నది లేదు. రుషివాక్యం సత్యదూరం కాదు కదా!

**నిర్దస్యుర భవల్లోకో నానర్థం కశ్చిదస్పృశత్**
**నచస్మవృద్ధా బాలానాం ప్రేత కార్యాణి కుర్వతే** వాల్మీకి రామాయణం యుద్ధకాండ లోని ఈ శ్లోకానికి రామరాజ్యంలో దొంగలు లేరు. పిల్లలకు ప్రేతకార్యం చేసే అవసరం ఎన్నడూ ఎక్కడా కలగలేదు అనేది భావం. ఆ కాలంలో ప్రజలెవ్వరినీ అకాలమృత్యువు హరించలేదంటూ తులసీదాసు రామాయణంలోనూ లిఖిత మైంది. కంకంటి పాపరాజు ఉత్తర రామాయణంలో సుతులు లేక కలంగు సుదతు లెక్కడ లేరు అంటూ భరతుడు శ్రీరామచంద్రుడికి తెలియ జేయడం కనిపిస్తుంది. ఇందులోనే ధర్మాభిదానమంత కడు నిక్కమొనర్చె ముదుసళ్లనైనను గడియబోక అనే ప్రయోగం ఉంది. రామ రాజ్యంలో ప్రజలెవ్వరూ బాధపడలేదు. లోకం ధర్మబద్ధంగా నడిచింది. అకాల మరణాలు సంభవించవు అనేది భావం. ◻

# మెక్సికన్ పరోటా రోల్స్



కావలసిన పదార్థాలు: బ్రకోలీ ముక్కలు: ఒక కప్పు, సన్నగా తరిగిన ఉల్లిగడ్డ, క్యాప్సికం, టమాట ముక్కలు: పావు కప్పు చొప్పున, చీజ్ తురుము: ఒక కప్పు, ఉడికించిన స్వీట్‌కార్న్: రెండు టేబుల్ స్పూన్లు, మిరియాల పొడి: అర టీస్పూన్, కారం: ఒక టీస్పూన్, ఉప్పు: తగినంత, నిమ్మరసం: ఒక టేబుల్ స్పూన్, గోధుమపిండి, మైదాపిండి: ఒక కప్పు చొప్పున, నూనె: అర కప్పు. **తయారీ ..** ఒక గిన్నెలో మైదాపిండి, గోధుమపిండి, ఒక టేబుల్ స్పూన్ నూనె, కొద్దిగా ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంలో తగినన్ని నీళ్ల పోసి ముద్దలా కలిపి పావుగంట మూతపెట్టి పక్కనపెట్టాలి. బ్రకోలీ ముక్కల్ని పది నిమిషాల పాటు ఉప్పునీళ్లలో ఉడికించి చిన్నగా తరగాలి. ఒక గిన్నెలో బ్రకోలీ, టమాట, క్యాప్సికం, ఉల్లిగడ్డ ముక్కలు, చీజ్ తురుము, స్వీట్ కార్న్, కారం, మిరియాల పొడి, ఉప్పు, నిమ్మరసం వేసి బాగా కలపాలి. స్టవ్ మీద పెనం పెట్టి వేడి చెయ్యాలి. పిండి మిశ్రమాన్ని కొద్దికొద్దిగా తీసుకుని చపాతీలా ఒత్తి పెనంపై వేసి ఒక నిమిషంపాటు రెండు వైపులా తిప్పుతూ కాల్చుకోవాలి. కాలిన చపాతీ మధ్యలో బ్రకోలీ మిశ్రమం పెట్టి గుండ్రంగా చుట్టి ఒక నిమిషంపాటు మూతపెడితే వేడివేడి మెక్సికన్ పరోటా రోల్స్ సిద్ధం. ◻

# 'గ్రహాంతర ప్రేమికుడు' చిత్రం ట్రైలర్ విడుదల



ప్రముఖ యూట్యూబర్, క్రియేటివ్ డైరెక్టర్ స్టైల్ రవి తెరకెక్కిస్తున్న వినూత్న ఓటిటి చిత్రం 'గ్రహాంతర ప్రేమికుడు'. సినీ చరిత్రలోనే ఒక మైండ్‌బ్లోయింగ్ ప్రయోగంగా రాబోతున్న ఈ సినిమా ఫస్ట్ లుక్, ట్రైలర్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెలగపూడి సచివాలయంలో ఘనంగా విడుదల చేశారు. 'విశ్వంలో ఏలియన్స్ ఉనికిపై ప్రపంచవ్యాప్తంగా సైంటిస్టులు రీసెర్చ్ చేస్తున్నారు. ఇలాంటి టైంలో ప్రజలను ఆలోచింపజేసే కథాంశంతో వస్తున్న 'గ్రహాంతర ప్రేమికుడు' ఒక అద్భుత ప్రయోగం. ఏలియన్స్‌తో మానవాళికి ముప్పా? మేలా? అనే పాయింట్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. ఇలాంటి కొత్త కంటెంట్ తో వచ్చే దర్శకులకు, ఎపిలో సినిమా తీసే ప్రతి ఒక్కరికీ కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుంది' అని చిత్ర యూనిట్‌ని మంత్రి కందుల దుర్గేష్ అభినందించారు. "భూమి ట్రాన్సిట్ జోన్‌లో 1,715 నక్షత్రాలు ఉన్నాయనే సైంటిఫిక్ రీసెర్చ్ ఆధారంగా ఈ కథను సిద్ధం చేశాం. విశ్వకాంతి వేగంతో ఏలియన్స్ ప్రయాణించే విజువల్స్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తాయి. ఎఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), హైఎండ్ విజువల్ ఎఫెక్ట్స్, టాప్ నాచ్ కంప్యూటర్ గ్రాఫిక్స్ సాయంతో అంతర్జాతీయ సాంకేతిక ప్రమాణాలతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం" అని సినిమాపై ఉన్న నమ్మకాన్ని దర్శకుడు స్టైల్ రవి వ్యక్తపరిచారు. ఈ చిత్రంలో భవానీ కపూర్, రమ్య రాథోడ్, సముద్రాల శ్రీధర్ శర్మ, రమేష్ వర్మ, వారణాసి పాత్రుడు, యశ్వంత్ చంద్ర, మల్లెపాడు రమేష్, సైదులు తదితరులు నటిస్తున్నారు. నిర్మాతగా ఎలిజబెత్ (కెనడా) వ్యవహరించగా డిఓపి ప్రకాష్ జైన్ (రాజస్థాన్), ఎడిటర్ ఆండ్రు అలెక్సా, ఎఐ కంపోజర్ బెంజమిన్ వియర్, కంప్యూటర్ గ్రాఫిక్స్‌ను అలెక్సా తెరకెక్కించారు.

# రోషన్ కనకాల కొత్త చిత్రం ప్రారంభం



కొన్ని సినిమాలు ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తాయి. ఫాంటసీ, సైన్స్ ఫిక్షన్, ప్రేమ, మిస్టరీ కలిసిన అలాంటి కొత్త ప్రపంచాన్ని పరిచయం చేయబోతున్న ఓ భారీ కాన్సెప్ట్ సినిమా ఘనంగా ప్రారంభమైంది. రోషన్ కనకాల, గహజి ప్రధాన పాత్రల్లో సరి కొత్త హైకాన్సెప్ట్ సైఫై ఎంటర్‌టైనర్ అధికారి కంగా లాంచ్ అయ్యింది. సత్య, సుదర్శన్, రవితేజ నన్నిమాల ఇతర కీలక పాత్రలు పోషిస్తు న్నారు. ఈ చిత్రం ద్వారా విజయ్ కె కామిశెట్టి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రముఖ దర్శకుడు విఐ ఆనంద్ వద్ద చీఫ్ అసోసియేట్ డైరెక్టర్, డైలాగ్ రైటర్‌గా ఎన్నో ఏళ్లుగా పనిచేసిన విజయ్, 'టైగర్', 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', 'ఒక్క క్షణం', 'డిస్కో రాజా', 'స్వయంభు' వంటి విజయవంతమైన చిత్రాలలో కీలక పాత్ర పోషించారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమలో ఫాంటసీ, సైన్స్ ఫిక్షన్ సినిమాల స్థాయిని తన వినూత్న స్టోరీ టెల్లింగ్‌తో మార్చిన విఐ ఆనంద్ అందించిన కథ ఆధారంగా ఈ చిత్రం రూపొందు తోంది. గుత్తా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై బాలాజీ గుట్ట, కౌశిక్‌రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి కమలాకర్ ఫిల్మ్ కార్పొరేషన్ సహకారం అందిస్తోంది. ఆసక్తికరమైన కాన్సెప్ట్, భారీ స్థాయి నిర్మాణంతో ఈ చిత్రం సరికొత్త సినిమాటిక్ అనుభూతిని అందించ నుంది. కాకతీయ హిల్స్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన సాంప్రదాయ పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం ఈ రోజు ఘనంగా ప్రారంభ మైంది. హీరో నిఖిల్ ముహూర్తపు షాట్‌కు క్లాప్ కొట్టగా, సినిమాటో గ్రాఫర్ కెకె సెంథిల్ కుమార్ కెమెరాను స్విచ్ ఆన్ చేశారు.

# తెర

# 'మైసా' కోసం రష్మిక రిస్కీ స్టంట్స్




బాడీ డబుల్ లేకుండా రెండు రోజుల్లో 20 గంటల పాటు అండర్‌వాటర్ ఫైట్ సీక్వెన్స్ పూర్తి చేసిన భారతీయ సినీ చరిత్రలో తొలి హీరోయిన్‌గా రికార్డు సృష్టించిన రష్మిక మందన్న నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రస్తుతం ప్రతిష్టాత్మక పాన్ ఇండియా యాక్షన్ డ్రామా 'మైసా' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ సినిమాలో ఆమె కెరీర్‌లోనే అత్యంత సవాల్‌తో కూడిన పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్ సినిమాపై భారీ ఆసక్తిని పెంచగా, ఇప్పుడు రష్మిక చేస్తున్న రిస్కీ స్టంట్స్ మరింత అంచనాలని పెంచుతోంది. రవీంద్ర పుల్లే దర్శకత్వంలో, అన్‌ఫార్ములా ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రష్మిక గోండ్ గిరిజన యువతి పాత్రలో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా కోసం అత్యంత ప్రమాదకరమైన యాక్షన్ సన్నివేశాలను రష్మిక స్వయంగా చేశారు. రెండు రోజుల పాటు దాదాపు 20 గంటల పాటు నీటిలో ఉండి అత్యంత క్లిష్టమైన అండర్‌వాటర్ ఫైట్ సీక్వెన్స్‌ను చిత్రీకరించారు. ఈ సన్నివేశం కోసం బాడీ డబుల్‌ను ఉపయోగించకుండా, స్వయంగా నటించాలని రష్మిక నిర్ణయించుకున్నారు. సన్నివేశాల్లో సహజత్వం కోసం ఆమె చూపించిన ఈ అంకితభావం సినిమా టెక్నికల్ టీమ్‌తో పాటు అండర్‌వాటర్ యాక్షన్ టీమ్‌ను కూడా ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ చిత్రంలో రాహుల్ రవీంద్ర, ఈశ్వరి రావు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సినిమాటోగ్రఫీని శ్రేయాస్ పి.కృష్ణ అందిస్తుండగా, జేక్స్ బిజోయ్ సంగీతం సమకూరుస్తున్నారు. అంతర్జాతీయ యాక్షన్ కొరియోగ్రాఫర్ కేచా ఖాంఫక్‌డీ యాక్షన్ సన్నివేశాలను రూపొందిస్తున్నారు.

# 'ది ఇండియా స్టోరీ' ఇంటెన్స్ పోస్టర్ రిలీజ్



జీ స్టూడియోస్, ఎంఐజీ ప్రొడక్షన్ అండ్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'ది ఇండియా స్టోర్త్ సినిమా నుంచి మరో ఆసక్తికరమైన పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. చేతన్ డీకే దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సాగర్ బి. షిండే కథ అందించడంతో పాటు నిర్మిస్తున్నారు. సమాజానికి సంబంధించిన కీలక అంశాన్ని కోర్ట్‌రూమ్ డ్రామా రూపంలో చూపిస్తున్న ఈ సినిమా జూలై 24, 2026న ప్రపంచవ్యాప్తంగా హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. విషపూరిత పురుగుమందుల వ్యవసాయం, దాని వల్ల ప్రజల ఆరోగ్యంపై పడుతున్న తీవ్ర ప్రభావం వంటి అంశాల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ సినిమాలోని కొత్త పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. విడుదల చేసిన పోస్టర్‌లో కాజల్ అగర్వాల్, శ్రేయాస్ తల్పాడే తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల్లో కనిపిస్తున్నారు. ఒక భయానక నిజాన్ని బయటపెట్టేందుకు వారు చేసే పోరాటాన్ని ఈ పోస్టర్ సూచిస్తోంది. కూరగాయల మార్కెట్ బ్యాక్ డ్రాప్ లో రూపొందిన ఈ పోస్టర్‌లో ఇద్దరూ ఆగ్రహంతో ఉన్న వ్యాపారుల మధ్య చిక్కుకున్నట్లు చూపించారు. చుట్టూ ఉన్న జనాలు వారిపై కూరగాయలు విసురుతూ, వేలెత్తి చూపిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాజల్, శ్రేయాస్ ముఖాల్లో కనిపించే భయం, చుట్టూ నెలకొన్న ఉద్రిక్త వాతావరణం నిజాన్ని బయటపెట్టే ప్రయత్నం చేసే వారికి ఎదురయ్యే ప్రతిఘటనను బలంగా చూపిస్తోంది.

# 'రక్త చరిత్ర' నా కెరీర్‌లో చాలా స్పెషల్

**: రామ్ గోపాల్ వర్మ**



'రాయలసీమ ఫ్యాక్షనిజంలోని యథార్థ ఘటనలను ఆధారంగా చేసుకుని 'రక్త చరిత్ర' సినిమాను తీశాను. అందులోని క్యారెక్టర్స్ గురించి ఎంతో స్టడీ చేసిన తర్వాతే ఈ సినిమాను మొదలుపెట్టాం. నా కెరీర్ లో చాలా స్పెషల్ సినిమా ఇది" అని సెన్సేషనల్ డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ అన్నారు. వివేక్ ఒబెరాయ్, సూర్య, రాధికా ఆప్టే, ప్రియమణి ప్రధాన పాత్రధారులుగా నటించిన ఈ సినిమా 2010లో విడుదలై, అప్పట్లో సూపర్ హిట్ అయింది. 16 ఏళ్ల తర్వాత ఈ సినిమాను త్రిపుర క్రియేషన్స్ అధినేత మురళీకృష్ణ వంకాయలపాటి, నట్టీస్ ఎంటర్టైన్మెంట్స్, క్విటీ ఎంటెర్టైనెంట్స్ తరపున నట్టి కుమార్ రీ రిలీజ్ చేస్తున్నారు. స్టార్ డామినేషన్ లో తప్పు లేదు సినిమా ఇండస్ట్రీ లో ఒకప్పుడు డైరెక్టర్ కు అధిక ప్రాధాన్యం ఉండేది. డైరెక్టర్ ను కెప్టెన్ ఆఫ్ ది షిప్ అనే వారు...మరి నేడు స్టార్ డామినేషన్ ఎక్కువైంది. దీనికి కారణం ఏమిటి? అన్న ప్రశ్నకు వర్మ బదులిస్తూ... డైరెక్టర్ కు ఏమైనా కిరీటం ఉంటుందా!. స్టార్ ముఖం చూసి ప్రేక్షకులు టిక్కెట్లు కొంటున్నప్పుడు... కోట్లాది రూపాయల బిజినెస్ స్టార్ మూలంగా జరుగుతున్నప్పుడు సహజంగానే స్టార్ డామినేషన్ ఉండటంలో ఎలాంటి తప్పు లేదు. ఫ్యామిలీ సెంటిమెంట్, మల్టీ స్టారర్ సినిమాలు తీయను నా జీవితంలో ఫ్యామిలీ సెంటిమెంట్ సినిమాలు ఎప్పటికీ తీయను. ఫ్యామిలీ సెంటిమెంట్ సినిమాలు ఎవరి కోసం తీయాలి. ఒక కుటుంబం థియేటర్ కు సినిమాకు వెళితే...భర్త ఏమో హీరోయిన్ ను చూస్తాడు, అత్యధిక థియేటర్లలో రీ రిలీజ్ చేస్తున్నాం: నట్టి కుమార్, మురళీకృష్ణ ఒకప్పుడు రాయలసీమలో రెండు వర్గాలు ఎలా కత్తులు దూసుకున్నాయి. దానివల్ల ఎంత మారణ హోమం జరిగిందన్న అంశాన్ని రక్త చరిత్ర సినిమాలో వర్మ చాలా చక్కగా చూపించారని, అప్పట్లో బ్లాక్ బస్టర్ అయిన ఈ చిత్రాన్ని ఈ జనరేషన్‌కి కూడా చూపించాలన్న ఉద్దేశ్యంతోనే రీ రిలీజ్ చేస్తున్నామని నిర్మాతలు నట్టి కుమార్, మురళీకృష్ణ వంకాయలపాటి తెలిపారు.

# 'సైరాబాను' మొదటి షెడ్యూల్ పూర్తి



శంబాల ఘనవిజయంతో మంచి జోష్‌లో ఉన్న హీరో ఆది సాయి కుమార్, ప్రస్తుతం సరికొత్త కాన్సెప్ట్, కమర్షియల్ అంశాల కలయికతో రూపొందుతున్న మరో ఆసక్తికరమైన ఎంటర్ టైనర్‌లో నటిస్తున్నారు. 'కెర్యాంప్'(K-Ramp) వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత, హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా నిర్మిస్తున్న ఈ మూవీ టైటిల్ 'సైరాబాను'. ఫణి కృష్ణ సిరికి దర్శకత్వం వహిస్తున్నారు. కృష్ణకాంత్ పరుచూరి సహనిర్మాతగా ఈ ప్రాజెక్ట్‌ను సమర్పిస్తున్నారు. ఒక హిందూ యువకుడు, ముస్లిం యువతి మధ్య సాగే విభిన్నమైన ప్రేమకథను దర్శకుడు ఫణి కృష్ణ సిరికి ఇందులో అద్భుతంగా తీర్చిదిద్దుతు న్నారు. హైదరాబాద్ , రాజమండ్రి నేపథ్యంలో సాగే ఈ చిత్రం మొదటి షూటింగ్ షెడ్యూల్ ఇప్పటికే పూర్తయింది. 15 రోజుల పాటు జరిగిన ఈ షెడ్యూల్‌లో ఆది సాయి కుమార్, బాంధవి శ్రీధర్, వెన్నెల కిషోర్, ఇతర ప్రధాన తారాగణం పాల్గొన్నారు. చిత్రం రూపుదిద్దు కుంటున్న తీరు పట్ల చిత్ర బృందం ఎంతో సంతోషంగా ఉంది, వారి ఉత్సాహం BTS (బిహైండ్‌దిసీన్స్) వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. సెట్స్‌లో నెలకొన్న సరదా వాతావరణాన్ని, అందరి ముఖాల్లోని ఆనందం ఈ వీడియో కళ్లకు కట్టినట్లు చూపిస్తుంది. ఈ ప్రాజెక్ట్ అనుభవజ్ఞులైన సాంకేతిక నిపుణుల పని చేస్తున్నారు. రామ్‌రెడ్డి సినిమాటోగ్రఫీ, శేఖర్ చంద్ర సంగీతం, చోటా కె ప్రసాద్ ఎడిటింగ్, బ్రహ్మ కడలి ప్రొడక్షన్ డిజైన్‌ను

# తిరుపతి డివిజన్

## శ్రీకాళహస్తి గురుకులంలో ఆకస్మిక తనిఖీ..



శ్రీకాళహస్తి, జులై 10 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి రాజీవ్ నగర్ గిరిజన గురుకుల బాలికల కళాశాలలో రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు మాసారపు సుబ్బయ్య శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ మేరకు కళాశాలకు చేరుకున్న ఆయన ముందుగా వంటగదిని పరిశీలించారు. ఆహార పదార్థాల నాణ్యత, వంట చేసే విధానం, పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం స్టోర్ రూమ్‌లో నిల్వ ఉన్న బియ్యం, పప్పులు, నూనె తదితర సరుకుల నిల్వలు, గడువు తేదీలను చెక్ చేశారు. విద్యార్థినులకు అందిస్తున్న మెనూ, ఆహారంలో వైవిధ్యం గురించి వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాసారపు సుబ్బయ్య మాట్లాడుతూ గిరిజన గురుకులాల్లో చదువుతున్న బాలికలకు నాణ్యమైన ఆహారం, శుభ్రమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, వార్డెన్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి ఓటు కీలకం: కొట్టే సాయి



శ్రీకాళహస్తి,జులై 10 ప్రభాతవార్త: భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఇంటింటి సర్వే కొనసాగుతోంది.శ్రీకాళహస్తి 5వ వార్డు పరిధిలో జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి, శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ ప్రజాబంధు సాయి బిఎల్ఓలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయి కొట్టే మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ మన బాధ్యత–ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం మన కర్తవ్యం అన్నారు. సమగ్ర సర్వే ప్రజా చైతన్యం ప్రతీ కార్యకర్త నిరంతరం కార్యాచరణలో ఉండాలి అని పిలుపునిచ్చారు. అలాగే ఓట్లు బ్లాక్, డిలీట్ కాకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. ఓట్లు తొలగిపోకుండా బిఎల్ఏ లు అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చిన మై బూత్ మై ఓటర్‌ఖి వంటి యాప్స్ ను డౌన్‌లోడ్ చేసుకొని ఓటర్ల వివరాలను డిజిటల్‌గా అనుసంధానం చేసుకోవాలని సూచించారు.

## సర్ ప్రక్రియను పలు పంచాయతీలో...



బుచ్చినాయుడు కండ్రిగ, జులై 10 ప్రభాతవార్త: సత్యవేడు నియోజకవర్గ ఎన్నికల అధికారి రోజ్ మాండ్ సర్ కార్యక్రమంలో భాగంగా బి.ఎన్. కండ్రిగ మండలంలోని పలు గ్రామపంచాయతీలో పర్యటించి సర్ ప్రక్రియ సర్వే గురించి పక్కగా నిర్వహించాలని ఆమె తెలిపారు. సర్ ప్రోగ్రాం లో భాగంగా తిమ్మబూ పాలపురం, చెల్లమంబపురం, పార్లపల్లి, పల్లమల, గాజులపెళ్లూరు, కాంచన పుత్తూరు, కరనిమిట్ట, వెస్ట్ వరత్తూరు నెలవాయి పోలింగ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలను సందర్శించి, జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు మూలమని అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని ఇందులో ఇటువంటి రాజకీయ ఉద్దేశాల పరంగా ప్రలోభాలకు అవకాశం ఇవ్వకుండా నిజాయితీగా సర్ సర్వేను నిర్వహించాలని సంబంధిత అధికారులు, సూపర్వైజర్లు మరియు బి ఎల్ ఓ లకు అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు అందజేశారు. అలా కాదని సప్త విరుద్ధంగా ఆయా పంచాయతీ అధికారులు తప్పుడు సమాచారం అందిస్తే నిజనిర్ధారణ కమిటీలో బాధ్యత వహించవలసి ఉంటుందని హెచ్చరించారు. ఈ సర్ ప్రక్రియ పలు రాష్ట్రీయ ప్రాంతాల్లో ప్రాంతాల్లో ఓటు హక్కు కలిగి ప్రజాస్వామ్యానికి భారత దేశ సర్వ భూమత్వానిక కలువు మొక్కలుగా మారుతున్నారని సూచించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట రత్నమ్మ, ఎమ్మార్వో లక్ష్మీనారాయణ, ఆర్ ఐ మించల నలయ్య,సురేష్, జనరల్ సెక్రెటరీ చంద్రమోళి రెడ్డి, జగన్నాథం, అంకయ్య, గురునాథం తదితర నాయకులు, కార్యకర్తలు బి ఎల్ వో లు తదితరులు పాల్గొన్నారు

## ట్రాక్టర్ బోల్తా ఒకరు మృతి,4కి గాయాలు

తొట్టంబేడు, జులై 10 ప్రభాతవార్త: ఆనందోత్సాహంతో వివాహానికి వెళ్ళారు అక్కడ వివాహం జరిగి 16రోజుల పండగ చూసుకొని తిరుగుపయనమయ్యారు. ఇంకా కొంతసేపటికి ఇల్లు చేరుకుంటారనగా మృత్యువు రోడ్డుపై గుంత రూపంలో వచ్చింది. రెప్పపాటులో వేగంగా వెళుతున్న ట్రాక్టర్ ఒక్కసారిగా కుదుపు ఇచ్చింది. ఇంకేముంది. ఒక్కసారిగా ట్రాక్టర్ బోల్తాపడింది. ఏం జరిగిందని అని చూసుకునే లోపల అంతా జరిగిపోయింది. ఓ ప్రాణం గాలిలో కలసింది. నలుగురు ఆసుపత్రి పాలయ్యారు. తొట్టంబేడు మండలం, రౌతు సూరమాల వద్ద గురువారం రాత్రి జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో ఒక మహిళ మృతిచెందగా 4గురికి గాయాలు అయ్యాయి. తొట్టంబేడు మండల ఎస్సై బి. బాలకృష్ణ తెలిపిన వివరాల మేరకు, గూడూరులోని ఓ శుభకార్యానికి వెళ్లి వస్తున్న 13 మంది ఒకే ట్రాక్టర్ లో ప్రయాణిస్తున్నారు.తిరుగు ప్రయాణంలో రౌతుసూరమాల వద్ద రోడ్డుపై ఉన్న గుంతల్లో ట్రాక్టర్ పడి అదుపుతప్పి బోల్తా పడింది.ఈ ప్రమాదంలో ఆదెమ్మ అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు.గాయపడిన వారిలో దీక్షిమ, చిన్నమ్మ, సుబ్బమ్మ, హర్షిత, దీక్షిత, రావమ్మ, వెంకటమ్మ తదితరులు ఉన్నారు. ఇందులో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. వారికి స్వల్ప గాయాలయ్యాయి. మిగతా వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. క్షతగాత్రులకు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.ప్రమాద స్థలంలో ప్రధాంగా రోడ్డు సమస్య ఉందని, గుంతలు ఎక్కువగా ఉండటం వల్లే ట్రాక్టర్ అదుపుతప్పిందని స్థానికులు ఆవేదనవ్యక్తం చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.బాలకృష్ణ తెలిపారు.

## యూత్‌హాస్టల్‌లో అవగాహన



తిరుపతి,జులై 10ప్రభాతవార్త: భారత ప్రభుత్వం రూపొందించిన విభిన్న ప్రతిభా వంతులు కు కన్స్యూమర్ గైడ్ గురించి వివరించారు. యూత్ హాస్టల్ లో విభిన్నప్రతిభావంతులతో ఒక రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ విజయవాడ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్టాండర్డ్స్ ప్రమోషన్ ఆఫీసర్ కృష్ణవేర్ వర్మ బిఐఎస్ యొక్క పనితీరు, నాణ్యత గుర్తింపు చిహనాలు మార్క్ వున్న వస్తువులు, గురించి తెలిపారు. జిల్లా విభిన్న ప్రతిభ వంతులు , వయోవృద్ధులు అసిస్టెంట్ డైరెక్టర్ వినోద్ , రాస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ యువరాజులు నాయుడు , బిఐఎస్ స్టేట్ రిసోర్స్ పర్సన్, రూరల్ యాక్షన్ సంస్థ కార్యదర్శి పి.చిట్టీ బాబు బిఐఎస్ విధి విధానాలు గురించి తెలియ జేశారు. విభిన్న ప్రతిభా వంతుల యూనియన్ నాయ కులుమురళి,సుబ్రహ్మణ్యం, ఎన్‌జిఓస్ అమర్నాథ్, పరివార్తన సంస్థ,50మంది ప్రతినిదులు పాల్గొన్నారు.

## టిడిపి నేత ఇంటికి హాజరైన ఎమ్మెల్యే

వాకాడు, జులై 10, ప్రభాతవార్త

వాకాడు మండలం రావిగుంటపాలెం పంచాయతీ పరిధిలోని బస్సు పాలెం గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు బుజ్జిగేంద్ర రావు నూతన గృహ ప్రవేశానికి శుక్రవారం గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ హాజరయ్యారు. డాక్టర్ పాశం సునీల్ కుమార్‌తో పాటు మండల టిడిపి నాయకులు హాజరయ్యారు. టిడిపి యువ నాయకుడు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుజ్జి గేంద్రరావు ఎమ్మెల్యేకు శాలువా కప్పి బొకేని అందజేసి గౌరవంగా ఆహ్వానించాడు. ఎమ్మెల్యేతో పాటు, నాయకులకు, కార్యకర్తలకు, గ్రామ ప్రజలకు తేనేటి విందును ఇచ్చారు, ఎమ్మెల్యేతో పాటు నాయకులు కూడా నూతన గృహ ప్రవేశంలో చేరిన బుజ్జి కేంద్రరావుకు శుభాకాంక్షలు అందజేశారు.

## నాయుడుపేట ధీరుడు ఇకలేరు



నాయుడుపేట, జులై 10 ప్రభాతవార్త : నాయుడుపేట మల్లెమాల రాఘవరెడ్డి పెద్ద అల్లుడు వెందోటి ప్రద్యుమున కుమార్ రెడ్డి (76) శుక్రవారం తిరుపతి సిమ్స్ హాస్పిటల్లో సుమారు 11:30 గంటల సమ యంలో తుది శ్వాస విడిచారు. రాజకీయంగా సీనయ్య సేనలో ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షులుగా దివంగత నేత నల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన అడుగుజాడల్లో నడిచి రాజకీయ జీవితాన్ని మూడు పూలు ఆరు కాయలుగా జీవితాన్ని కొనసాగించారు. ఇదేవిధంగా కాంగ్రెస్ పార్టీలో మాజీ ముఖ్యమంత్రులైన నే నేదురుమల్లి జనార్దన్ రెడ్డి. వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో సీనియర్ నాయకుడుగా ఉండి అనేక పార్టీ పదవులు నిర్వహించారు. ఈ కోవలో నాయుడుపేటలో పార్టీ పదవులతో పాటు నాయుడుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరపతి సంఘం అధ్యక్షులుగా తన అండదండలతో హౌస్ బిల్డింగ్‌సొసైటీజిల్లాసహకారబ్యాంక్ డైరెక్టర్లు ముఖ్యంగా నాయుడుపేట పంచాయతీ సర్పంచ్‌గా గూడూరు ప్రభావతమ్మ రాష్ట్రంలోనే రెండవ స్థానం అత్యధిక మెజారిటీ సాధించిపెట్టిన ఘనత ఆయనకే దక్కింది.

## ప్రత్యేక ఓటరు జాబితా విజయవంతం చేయాలి నాగిరెడ్డి

నాయుడుపేట, జులై 10, ప్రభాతవార్త



కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ నాయకులు నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు జువ్వలపాలెం గ్రామంలో నిర్వహించిన సర్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన బిఎల్ఓ సుస్మిత, సూపర్వైజర్ హేమలతలతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ సవరణ జాబితా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత గల ప్రతి ఒక్కరూ తమ ఓటు నమోదుకు అవసరమైన పత్రాలను అందించి బిఎల్ఓలతో పాటు అధికారులకు సహకరించాలని కోరారు.

## ప్రవక్త జీవితాన్ని మార్గదర్శకంగా ఆచరించాలి : రేహాన్



శ్రీకాళహస్తి,జూలై 10 ప్రభాతవార్త: మనల్ని సృష్టించిన అల్లాహ్ జీవితాన్ని ఎలా గడపాలనేందుకు దివ్యఖురఆన్‌ను వరంగా ప్రసాదించారని దానిని ఎలా ఆచరించాలో మహమ్మద్ ప్రవక్తను ఆదర్శంగా పంపారని హాఫీజే ఖుర్ అన్ రేహాన్ సాహెబ్ అన్నారు. శుక్రవారం జామియా మస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు మనం అల్లాహ్ ఆదేశాలను తుంగలో తొక్కామన్నారు. మనం భక్తితో ఏకాగ్రతతో అల్లాహ్ ఎదుట మోకరిల్లి శరణుజొచ్చితే తిరుగులేని వరాలిస్తాడన్నారు. కానీ మనం నేడు అల్లాహ్ ఎదురుగా మోకరిల్లటానికే సమయం లేదన్నట్లుమారామన్నారు. మహమ్మద్ ప్రవక్త భావితరాల సంతతి కోసం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కానీ నేడు మనం మన ఇష్టప్రకారం నడుచుకుంటూ కష్టాలు,కన్నీళ్లు ఎదుర్కొంటు న్నామన్నారు. దైవ ప్రార్థనకు మించిన మందు లేదన్నారు. మనం ప్రశాంతంగా జీవితం గడపటానికి మంచి టానిక్ నమాజు అన్నారు. నేడు సమాజంలో కష్టాలకు మూలం ఆధ్యాత్మిక చింతనకు దూరం కావటమే అన్నారు. అంతేకాక అర్హత కల్గిన వారందరూ 'హజ్ యాత్ర' చేయాలన్నారు. అందుకు ఈ నెల 20 దరఖాస్తుకు చివరి తేది అని వివరించారు.

**సర్‌కు మూడేరోజులు సమయం:**

ఈ సందర్భంగా రేహాన్ మనకు సమాజంలో గుర్తింపు ఓటుతోనే కాబట్టి భారత ఎన్నికల కమిషన్ చేపట్టిన 'సర్' కార్యక్రమాలకు ఇక మూడే రోజులు సమయం ఉంది. ప్రతి ఒక్కరు 2002 ఓట్ల జాబితాలతో సరి చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు ఓటు కోల్పోకుండా అధికారులతో సహకరించాలని రేహాన్ సూచించారు.

## విధులు పారదర్శకంగా నిర్వహించండి

రేణిగుంట జూలై 10 ప్రభాతవార్త



కేంద్ర ఎన్నికల కమిషన్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ ( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ క్షేత్రస్థాయిలో పారదర్శంగా నిర్వహించాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశించారు. రేణిగుంట మండలం మల్లవరం సచివాలయం నందు జరుగుతున్న సర్ ప్రక్రియను ఆయన శుక్రవారం సమీక్షి ంచారు. సవరణ ప్రక్రియ ఎలా జరుగుతున్నదని బూత్ లెవెల్ ఆఫీసర్ల ద్వారా ఆరా తీశారు. బూత్ లెవెల్ ఆఫీసర్లు, ఆయా ప్రాంతాల బూత్ లెవల్ ఏజెంట్లు ఓటర్లకు ఓటు హక్కు పై అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సర్ ప్రక్రియ గురించి అపోహలకు తావు లేకుండా ఓటర్లకు తెలియజేయాల్సిన అవశ్యకత ఉందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలన్నదే సర్ ప్రక్రియ ప్రధాన ఉద్దేశం అన్నారు. ప్రలోభాలకు, అధికార రాజకీయ ఒత్తిళ్లకు లొంగి చనిపోయిన వారివి, అదేవిధంగా ఊరు నుండి శాశ్వతంగా వెళ్లిపోయిన వారి ఓట్లు ఎట్టి పరిస్థితుల్లో ఓటర్ల జాబితాలో నమోదు చేయకూడదన్నారు. ఈ విషయంపై బూత్ లెవెల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆర్ జి టి 4. సర్ ప్రక్రియను పరిశీలిస్తున్న బొజ్జల సుధీర్ రెడ్డి.

## పల్లమాల సుధీర్ మృతి: పలువురి నివాళులు



**శ్రీకాళహస్తి,జూలై 10 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తికి చెందిన సీనియర్ తెలుగుదేశం నాయకుడు పల్లమాల సుధీర్ గురువారం వేకువ జామున మృతి చెందారు. ఆయనకు శుక్రవారం అశ్రనయనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన మృతికి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి తన అనుచరులతో భౌతికాయానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్,జనసేన పార్టీకి చెందిన దండినరేంద్ర, బోర్డు సభ్యుడు దండి రాఘవయ్య,దుమ్ము రాయల్,లు సంతాపం తెలిపారు. కాగా మాజీ శాసనసభ్యుడు బియ్యపుమ ధుసూధనరెడ్డి, అంజూరు తారక శ్రీనివాసులు తన అనుచరులతో కలసి సంతాపం తెలిపారు. శ్రీకాళహస్తి బలిజ సంఘాధ్యక్షుడుగా తిరుపతి ఆర్‌టిసి డివిజన్ యూనియన్ కార్యదర్శిగా,నేషనల్ మజ్దూర్‌యూనియన్ నాయకుడుగా యూనియన్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించారు. కాగా మాజీ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కాపు నాయకుడు గాజుల సత్యనారాయణ పల్లమాల సుధీర్ మృతికి సంతాపం తెలిపారు.

## పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి



శ్రీకాళహస్తి,జూలై 10 ప్రభాతవార్త: ఏళ్ళ తరబడి ప్రభుత్వం తరపున ప్రజలకుసేవలందించి రిటైర్ అయిన ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం జరిగిన సమావేశంలో పలువురు డిమాండ్ చేసారు.ఈ సందర్భంగా పలువురికి సత్కరించారు.ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగుల సంఘ సమావేశం బి.వెంకయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పెన్షనర్ల 12వ పిఆర్‌సి ఏర్పాటు చేయాలని ఐఆర్ 30శాతం ప్రకటించాలని డిమాండ్ చేసారు.ఈ సందర్భంగా సంఘానికి సంబంధించిన పలువురు శ్రేయోభిలాషులను సంఘం సత్కరించింది. ఈ నేపథ్యంలో ఇటీవల తిరుపతి డెంటల్స్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడుగా ఎంపికైన డాక్టర్ లక్ష్మీనారాయణను సంఘం ఘనంగా సత్కరించింది. అలాగే తిరుపతిజిల్లా సహాధ్యక్షులుగా ఎన్నికైన బి.వెంకయ్యను, జిల్లా కార్యదర్శిగా పి.సత్యనారాయణ,బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఎన్నికైన పురుషోత్తంలను విశ్రాంత ఉద్యోగుల సంఘం సత్కరించింది. ఈ సమావేశంలో పి.సుబ్బారావు,జయానందం, రాధాకృష్ణ, గుణశేఖర్, జమ్మద్‌బాషా, గుర్నాథం, సిఎస్‌రెడ్డి, పిఎంఎస్‌రెడ్డి, పయని ప్రభాకర్,దాము, ఎసి భారతి, సుబ్బరామయ్య, వరలక్ష్మి సంఘం కుమార్ గోపి,మహేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు విద్యుత్ సౌకర్యం కల్పించాలి: సిపిఐ



శ్రీకాళహస్తి రూరల్,జూలై 10 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం, గంగలపూడి గ్రామంలో సుమారు 30 మంది రైతులకు విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో పంట భూములన్నీ బీడు భూములుగా మారాయని సిపిఐ వ్యవసాయ కార్మిక సంఘం ఆరోపించింది. గురువారం సంఘం ఆధ్వర్యంలో గంగలపూడి బీడు భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మించల శివకుమార్ మాట్లాడుతూ గంగలపూడిలోని ఓ బడా భూస్వామి తగిలం చెట్లు పెట్టారని, విద్యుత్ వైర్లు చెట్లకు తగులుతాయని, చెట్లు పాడైపోతాయని కారణం చూపి రైతుల మోటార్లకు విద్యుత్ సరఫరాను నిలిపివేయించారని ఆరోపించారు. దీంతో గత 5 నెలలుగా పంటకు నోచుకోకుండా రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.సమస్యపై సంబంధిత అధికారులు ఏఈ కరీముల్లా పంట పొలాలను పరిశీలించారని చెప్పారు. రైతులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఈకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏ. బాలరాజయ్య, వెంకటసుబ్బయ్య, రాజా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఏర్పేడు మండలంలో...



ఏర్పేడు, జులై 10 ప్రభాతవార్త : ఏర్పేడు నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి చేతులమీదుగా శుక్రవారం రెండు గ్రామాలకు తారు రోడ్లను ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో భాగంగా సుండి గ్రామ రోడ్డు నిర్మాణానికి 50 లక్షల రూపాయలు ఇసుకతాగేలి గ్రామ రోడ్డు నిర్మాణానికి 47 లక్షల రూపాయలతో తారు రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మొత్తం 97 లక్షల రూపాయలతో ఈ రెండు రోడ్ల నిర్మాణం జరగనున్నాయి. ఈ రోడ్లు పూర్తయితే చుట్టుపక్కల గ్రామాల ప్రజల రాకపోకలకు ఎంతో ఉపయోగపడతాయని స్థానికులు అన్నారు. ఈ సందర్భంగా బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పేడు మండల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. త్వరలోనే అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ హౌసింగ్ ఇళ్లు మంజూరు చేస్తాం. వితంతు పెన్షన్లు కూడా వెంటనే అందజేస్తాం అని హామీ ఇచ్చారు. మండలాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని, గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, విద్య, వైద్య సదుపాయాలు మెరుగుపరుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు పేరం నాగరాజ నాయుడు, సీనియర్ నాయకులు పేరం ధనంజయులు నాయుడు.., జిల్లా గ్రంథాలయ చైర్మన్ రెడ్డివారి గురువారెడ్డి,శివశంకర్ రెడ్డి, సూరి నాయుడు, మోహన్ నాయుడు, బాబు నాయుడు, మహేష్ రెడ్డి, పరశురామేశ్వరస్వామి గుడి చైర్మన్ బత్తల గిరి నాయుడు, గాలి క్రిష్ణవేణి, హంస, కుమారస్వామి, రవి నాయుడు, చంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తొట్టంబేడు ఉపాధ్యాయుడి గేయాలు...



తొట్టంబేడు, జులై 10 ప్రభాతవార్త : దిగువ సాంబయ్యపాళెం ఫౌండేషన్ పాఠశాల ఉపాధ్యాయులు కయ్యూరు బాలసుబ్రమణ్యం రాసిన గేయాలు ఈ సంవత్సరం మహారాష్ట్ర తెలుగు వాచకంలో పాఠ్యాంశాలుగా చోటు దక్కించు కున్నాయి. ఈ విషయంపై తిరుపతి జిల్లా విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ రమణారావు మహారాష్ట్ర తెలుగు వాచకాలలో బాలు రాసిన గేయాలను పరిశీలించి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో బాలు మరిన్ని రచనలు పాఠ్యాంశాలుగా రావాలని సూచించారు.ఈ సందర్భంగా తనను ప్రోత్సహిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారులకు బాలు ధన్యవాదాలు తెలియజేశారు.

## విశ్రాంత ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలి.!

చంద్రగిరి, జూలై 10 ప్రభాతవార్త: విశ్రాంత ఉద్యోగుల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు సి.గురుమూర్తి రెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో శుక్రవారం సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుండి రావలసిన డి.ఆర్ అరియర్స్, పి.ఆర్సీ, ఐ.ఆర్ వంటి బకాయిలను చెల్లించడంపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల గౌరవ అధ్యక్షుడు యారాశి చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శి బి.నరశింహారెడ్డి, కోశాధికారి డి.పట్టాభి, సభ్యులు గురుమూర్తి, అరుణాచలం, ఎ.మునిరెడ్డి, జయప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా కుంకుమార్చన

-కోదండ రాముల వారి చెంత శ్రీ మహాలక్ష్మి దీప పూజ



**చంద్రగిరి, జూలై 10 ప్రభాతవార్త:** శ్రీ మహాలక్ష్మీదేవి అమ్మవారికి కుంకుమార్చన సేవ కన్నుల పండువగా జరిగింది. చంద్రగిరిలోని టిటిడి అనుబంధ శ్రీకోదండరామస్వామి వారి ఆలయ ఆవరణలో శుక్రవారం టిటిడి ఆధ్వర్యంలో శ్రీ మహాలక్ష్మి దీప పూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. టిటిడి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పూజకు మహిళలు భారీ సంఖ్యలో హాజరై అమ్మవారికి భక్తిప్రపత్తులతో ధీపారాధన గావించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ పులివర్తి నాని మాట్లాడుతూ శ్రీమహాలక్ష్మి దీప పూజతో నియోజకవర్గంలో రాయల వారి పాలన వంటి రామరాజ్యం రావాలని ఆకాంక్షించారు. ప్రతి ఇంటికి అష్టలక్ష్మి, సౌభాగ్యంతో పాటు ప్రతి మహిళ కష్టాలను అధిగమించాలని కోరుకున్నారు. నాలుగు శతాబ్దాలకు పైగా చరిత్ర కలిగిన రాములవారి ఆలయానికి కోనేరు నిర్మించాలని కోరారు. అంతకు ముందు ఎంఎల్‌ఏ పులివర్తి నాని, పులివర్తి సుధ రెడ్డి ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. అదేవిధంగా టిటిడి అదనపు ఈఓ వెంకయ్య చౌదరి మాట్లాడుతూ కార్యక్రమం విజయవంతం కావడంలో విశేష కృషి చేసిన ఎంఎల్‌ఏకి, జెఈఓ డాక్టర్ శరత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్వీబిసి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో 18 సంవత్సరాలు పూర్తి చేసుకుని 19వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న క్రమంలో ఈ దీప పూజ విజయవంతం కావడం పట్ల అభినందిస్తూ మరిన్ని భక్తి కార్యక్రమాలను అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. జెఈఓ శరత్ మాట్లాడుతూ దీపం పరబ్రహ్మ స్వరూపం అన్నారు. ఈ దీపంలో కలియుగ వైకుంఠ వాసుడుని, శ్రీమహాలక్ష్మి అమ్మవారిని చూసుకోవచ్చున్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి 2 వేల మంది ఒక్కచోటకూర్చునిదీపసమూహంతోపూజించడంద్వారాఆయురారోగ్యఅష్టైశ్వర్యాలుకలగాలని కోరుకున్నారు.

## ఎంపీపీని పరామర్శించిన వైయస్ జగన్

పుల్లంపేట జులై 10 ప్రభాతవార్త : పుల్లంపేట మండల పరిషత్ అధ్యక్షుడు ముద్దా బాబుల్ రెడ్డిని శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఫోన్లో పరామర్శించారు ఇటీవల హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఎంపీపీ బాబుల్ రెడ్డికి హార్ట్ స్టంట్ వేసుకొని ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను ఫోన్ ద్వారా సమాచారం అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలని, అన్ని విధాలుగా పార్టీ సహాయ సహకారాలు అందిస్తామని చెప్పినట్లు ఆయన అనుచరులు తెలిపారు

## ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు: తెలుగంగ ఏఈ




తొట్టంబేడు, జులై 10 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గం, తొట్టంబేడు మండలం, తాటిపర్తి పంచాయతీ పరిధిలోని కళ్లిపూడి గ్రామ సమీపంలో, తెలుగు గంగ ప్రధాన కాలవ పక్కన ఉన్న ఖాళీ ప్రభుత్వ స్థలంలో కొందరు ఆక్రమణదారులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టి ఆక్రమణకు పాల్పడినట్లు వెలుగులోకి వచ్చింది.స్థానికుల సమాచారం మేరకు కాలవ పక్కన ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలంలో కొందరు వ్యక్తులు మట్టి దిబ్బలు పోసి, వాములు నిర్మించి, రేకుల షెడ్లు వేసి స్థలాన్ని ఆక్రమించుకున్నారు. తెలుగు గంగ కాలవకు సంబంధించిన ఈ స్థలం పూర్తిగా ప్రభుత్వానికి చెందినదని, దీనిని ఎవరూ ఆక్రమించడానికి వీలులేదని అధికారులు స్పష్టం చేశారు.ఈ విషయం జిల్లా స్థాయి అధికారుల దృష్టికి రావడంతో వారి ఆదేశాల మేరకు తెలుగు గంగ శాఖ అధికారులు కళ్లిపూడి వద్దకు చేరుకుని ఆక్రమణలను పరిశీలించారు. అసలు ఇక్కడ వీరికి స్థలాలు ఎవరిచ్చారు. ఎవరు రేకుల షెడ్లు వేసుకోమని చెప్పారు తెలియదు కానీ స్థానికంగా ఉన్నవారు కొందరు టిడిపి రాజకీయ పార్టీకి చెందిన నేతల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వారే దగ్గరుండి అన్ని చేస్తున్నారని స్థానికులు, గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఈ సందర్భంగా తెలుగుగంగ ఏఈ మాట్లాడుతూ తెలుగుగంగ ప్రాజెక్ట్ పరిధి లో ని భూములు, ఖాళీ స్థలాలు పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉంటాయి. ఇలాంటి స్థలాల్లో ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించారు. ఆక్రమణ దారులపై చట్టపరమైన చర్యలతో పాటు, నిర్మాణాలను కూడా కూల్చివేస్తామని ఏఈ హెచ్చరించారు.

## తెలుగుపై సిక్కు అధికారి మక్కువ




ఏర్పేడు,జూలై 10 ప్రభాతవార్త: తిరుపతి ఐసర్‌లో శుక్రవారం జరిగిన ఏడవ వార్షిక స్నాతకోత్సవం సభలో ఐసర్ రిజిస్ట్రార్ ఇంద్రప్రీత్ సింగ్ కోహ్లి ఆంగ్లం, హిందీ, తెలుగు భాషల్లో ప్రసంగించి విద్యార్థులను అతిథులను ఆకట్టుకున్నారు. సంప్రదాయ సిక్కు తలపాగాతో వేదిక నిలబడిన కోహ్లి ముఖ్యఅతిధి, పాలకమండలి, సేనేట్,కేంద్ర విద్యా,మంత్రిత్వ శాఖ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం అధ్యాపకులు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్న సభలో కోహ్లి మూడు భాషల్లో అనర్గళంగా మాట్లాడుతూ ఆకట్టుకున్నారు. కోహ్లి సిక్కు కుటుంబంలో జన్మించినప్పటికి ఆంధ్ర ప్రదేశ్ తనను ఆదరించి తన వృత్తి జీవితాన్ని తీర్చి దిద్దిన గడ్డ అని కోహ్లి తరచూ చెబుతుంటారు. 2010 బ్యాచ్‌కు చెందిన కేంద్ర సచివాలయ సేవా(సిఎస్ఎస్) అధికారి అయిన ఆయన రాష్ట్ర విభజన అనంతరం స్వచ్ఛందంగా ఆంధ్రప్రదేశ్‌ను తన శాశ్వత నివాసంగా ఎంచుకున్నారు.గోదావరి ప్రాంతంలో తనకున్న పూర్వీకుల అనుబంధాన్ని కూడా ఆయన గర్వంగా ప్రస్తావిస్తుంటారు. పరిపాలన ప్రభుత్వ, సేకరణ,సంస్థాగత పాలనా రంగాల్లో నిపుణుడిగా గుర్తింపు పొందిన కోహ్లి పలు జాతీయ ప్రాముఖ్యత కల్గిన సంస్థలకు కేంద్ర ప్రభుత్వ విభాగాలకు సేవలందించారు. భాష పుట్టక వల్ల కాదు గౌరవం అంకిత భావం ద్వారా సొంతమవుతుందని నిరూపిస్తూ తాను సేవ చేసే ప్రజల భాషను ఆత్మీయంగా స్వీకరించటమే అత్యున్నత సేవ అని కోహ్లి మాట్లాడుతుంటే సభ హర్షధ్వనాలతో దద్దరిల్లింది ఆయన ధన్యవాదాల ప్రసంగంలో 'ఏక్ భారత్ శ్రేష్ట భారత్' అనే పదాలు ఆయన స్ఫూర్తికి నిదర్శనంగా నిలిచింది. ఆయన నోట'దేశ భాషలందు తెలుగు లెస్స' అనే పదాలు వెలువడుతుంటే తెలుగు భాష ఔన్నత్యం ప్రతి ఒక్కరికి స్ఫూర్తి నిచ్చింది.

## పరశురామేశ్వరుని సేవలో పత్తికొండ ఎంఎల్‌ఏ



ఏర్పేడు,జూలై 10 ప్రభాతవార్త: ఏర్పేడు మండలంలోని గుడిమల్లం ఆలయంలో వెలసిన ఆనందవల్లి సమేత పరశురామేశ్వరుని సేవలో శుక్రవారం పత్తికొండ శాసనసభ్యుడు శ్యామ్‌కుమార్ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. కర్నూలు జిల్లాలోని పత్తికొండ ఎంఎల్‌ఏగ ఉన్న ఆయన ఆలయ ప్రాధాన్యతను గుర్తించి స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చారు. వారికి చైర్మెన్ బత్తల గిరినాయుడు,ఇఓ మునిశేఖర్ సిబ్బంది, వేదపండితులు స్వాగతం పలికారు. దర్శనానంతరం వారికి స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు.

## శివయ్య సేవలో కేంద్ర మంత్రి



శ్రీకాళహస్తి,జూలై 10 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరుని సేవలో శుక్రవారం భారత ప్రభుత్వ సూక్ష్మ,చిన్న,మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి జీతన్‌రామ్ మాంఝీ తన పరివారంతో పాల్గొన్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్, ప్రోటోకాల్ ఎఇఓ లోకేష్‌బాబు, ఎపిఆర్ఓ సుబ్రమణ్యంలు వేదపండితులతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం స్వామి అమ్మవార్ల చిత్రపటాలను ఆలయ ఎఇఓలు విద్యాసాగర్‌రెడ్డి, లోకేష్‌బాబులు అందించారు. స్వాగతం పలికిన వారిలో శ్రీకాళహస్తి తహాశీల్దార్ టివి సుబ్రమణ్యం, సహాయ తహాశీల్దార్ అనిల్ ఉన్నారు. ఎపిఆర్ఓ సుబ్రమణ్యం, టెంపుల్ ఇన్స్పెక్టర్ యం.హరియాదవ్,పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్‌లు పర్యవేక్షించారు.

## పరిశోధక విద్యార్థినికి డాక్టరేట్ ప్రదానం



తిరుపతి,జులై 10ప్రభాతవార్త: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆంగ్ల పరిశోధక విద్యార్థిని షేక్ జైనబ్ కి వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆచార్య టి. భారతీ పర్యవేక్షణలో ముస్లిం విమెన్ ఆటోబయోగ్రఫీస్: ఎ క్రిటికల్ స్టడీఖి అంశంపై పరిశోధనా గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ ప్రధానం చేసినట్లు డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కె. అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు సహచర విద్యార్థులు, ఆచార్యులు అభినందనలు తెలిపారు.



# గిన్నిస్ రికార్డుల్లోకి కర్ణాటక పనస

## 72 కిలోల బరువు ఉన్నట్లు నిర్ధారణ

**బెంగళూరు,జులై 10:** కర్ణాటకలో ప్రదర్శించిన ఒక పనసపండు ఏకంగా 72 కిలోల బరువుతో గిన్నిస్ రికార్డుల్లోకి వెళుతోంది. గిన్నిస్ బుక్ వివరాల ప్రకారం 2024లో అమెరికాలోని ఫ్లోరిడాలో ఓ రైతు పండించిన 54.43 కిలోల పనసే ప్రపంచంలోనే అత్యంత బరువైనది. దీంతో రైతు ప్రతాప్ ఈ పండును ప్రపంచ రికార్డు కోసం పంపే ప్రయత్నాలు చేస్తున్నారు. హసన్ జిల్లా సకలేశ్‌పుర్ పట్టణంలోని శ్రీనివాస కన్వెన్షన్ హాల్‌లో ఇటీవల పనస, మామిడి పండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో హెబ్బనహళ్లి గ్రామానికి చెందిన రైతు హెచ్.బి.ప్రతాప్ కుమార్ తన తోటలో పండిన మూడు భారీ పనసపండ్లను ప్రదర్శనకు తీసుకొచ్చారు. వాటిలో 72 కిలోల బరువున్న పనసపండు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. సాధారణంగా పనస పండును ఒక వ్యక్తి చేత్తో ఎత్తగలడు. కానీ ఈ భారీ పండును మాత్రం ఒకరు ఎత్తడం సాధ్యం కాలేదు. దాంతో ఇద్దరు కలిసి దానిని ఎత్తి బరువు చూడాల్సి వచ్చింది. దాని పరిమాణం, బరువు చూసిన వారంతా సెల్ఫీలు తీసుకుంటూ ఆసక్తిగా వీక్షించారు. ప్రస్తుతం గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రకారం ప్రపంచంలోనే అత్యంత బరువైన పనసపండు అమెరికాలోని ఫ్లోరిడాలో 2024లో నమోదైంది. ఆ పండు బరువు 54.43 కిలోలు. అయితే హసన్ జిల్లాలో ప్రదర్శించిన పనసపండు 72 కిలోలు ఉండటంతో, అది ప్రస్తుతరికార్డును దాదాపు 18 కిలోల తేడాతో అధిగమించే అవకాశం కనిపిస్తోంది. సకలేశ్‌పుర్ తాలూకా ఉద్యానవన శాఖ సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ బి.ఇ. భానుప్రకాశ్ మాట్లాడుతూ, తమకు తెలిసినంత వరకు ఉద్యానవన శాఖ వద్ద ఇంత భారీ బరువున్న పనస రకం లేదన్నారు. ఈ పనస ప్రపంచంలోనే అత్యంత బరువైనదా అనే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. అవసరమైన ధ్రువీకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌కు పంపే ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అన్ని ప్రమాణాలు సరిపోతే హెబ్బనహళ్లి గ్రామం పేరు ప్రపంచ రికార్డుల పుస్తకంలో నిలిచే అవకాశం ఉందన్నారు. ఈ యేడాది ప్రదర్శనలో ఉంచిన పనసపండు బరువు 72 కిలోలు కాగా, గత ఏడాది తమ తోటలో ఏకంగా 80 కిలోల బరువున్న పనసపండు కాసిందని ప్రతాప్ తెలిపారు. దానిని రికార్డుల కోసం నమోదు చేయలేకపోయామని చెప్పారు. ఈ భారీ పనస పండ్లను పెంచడానికి ఎలాంటి రసాయన ఎరువులు ఉపయోగించలేదని ఆయన వెల్లడించారు. పూర్తిగా సహజ పద్ధతుల్లోనే సాగు చేస్తున్నట్లు చెప్పారు. మల్నాడు ప్రాంతంలో ఈ రకాన్ని మక్కె పనస అని పిలుస్తారని తెలిపారు.

## ఆల్కహాల్ ఆధారిత దగ్గు సిరప్‌లకు డాక్టర్ల చీటీ తప్పనిసరి

**న్యూఢిల్లీ,జులై 10:** దేశంలో ఆల్కహాల్ ఆధారిత ఔషధాల నియంత్రణను మరింత పటిష్టం చేసేందుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ నిబంధనలను మరింత కఠినతరం చేసింది. 12 శాతంకంటే ఎక్కువ ఇథైల్ ఆల్కహాల్ కలిగిన ఔషధాలను లైసెన్స్ లేకుండా విక్రయించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే ఈ మందులను విక్రయించాలని పేర్కొంది. ఈ మేరకు డ్రగ్స్ రూల్స్, 2026ను ప్రభుత్వం నోటిఫై చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం 12 శాతం కంటే ఎక్కువ ఇథైల్ ఆల్కహాల్ కలిగి 30 మిల్లీలీటర్ల కంటే పెద్ద సీసాల్లో విక్రయించే సిరప్‌లు/టానిక్‌లను షెడ్యూల్ బీ1 పరిధిలోకి తీసుకొచ్చినట్లు పేర్కొంది. కొన్నిరకాల దగ్గు సిరప్‌లు, టానిక్‌లలో ఔషధాల స్థిరత్వం కోసం, క్రియాశీల పదార్థాలను కరిగించడం కోసం ఇథైల్ ఆల్కహాల్‌ను ఎక్కువశాతం ఉపయోగిస్తారు. అయితే ఈ ఔషధాలు సులభంగా లభిస్తుండటంతో వీటిని చికిత్స కోసం కాకుండా మత్తు కోసం దుర్వినియోగం చేస్తున్నారు. ఈ విషయంలో పలు రాష్ట్రాల నుంచి ఆందోళనలు వ్యక్తం అయ్యాయి. ఈ నేపథ్యంలో డ్రగ్స్ కన్సల్టేటివ్ కమిటీ, డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డుల సిఫార్సుల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వల్ల అవసరమైన రోగులకు ఈ ఔషధాలు ఎప్పటిలాగే అందుబాటులో ఉంటాయి. కానీ రిజిస్టర్డ్ డాక్టర్ ఇచ్చిన చెల్లుబాటు అయ్యే ప్రిస్క్రిప్షన్ ఉంటేనే ఈమందులు విక్రయించనున్నారు. వీటి విక్రయానికి సంబంధించిన వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. నియంత్రణ అధికారుల తనిఖీల కోసం ఆ ప్రిస్క్రిప్షన్లు, విక్రయ రికార్డులను కనీసం మూడేళ్ల పాటు భద్రపరచాల్సి ఉంటుంది.

# హత్యచేసినా.. బంగ్లాకు వెళ్తా

## అక్కడే మరణిస్తా: షేక్ హసీనా



**న్యూఢిల్లీ,జులై 10:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, అవామీ లీగ్ అధినేత్రి షేక్ హసీనా కీలక ప్రకటన చేశారు. స్వదేశంలో మరణశిక్షను ఎదుర్కొంటున్నప్పటికీ, ఈ యేడాది డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లి న్యాయస్థానం ముందు లొంగిపోవాలని నిర్ణయించుకున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్న 78 యేళ్ల హసీనా, ఒక మీడియా సంస్థకు టెలిఫోన్ ద్వారా ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఈ విషయాలను స్పష్టం చేశారు. తనతో పాటు పార్టీకి చెందిన ఇతర సీనియర్ నాయకులు కూడా స్వదేశానికి తిరిగి వస్తారని ఆమె పేర్కొన్నారు. వారు నన్ను అరెస్టు చేయవచ్చు లేదా హతమార్చవచ్చు. ఏదేమైనా నేను వెళ్లాల్సిందే. ఒకవేళ మరణం సంభవిస్తే, అది నా తల్లిదండ్రులు విశ్రమిస్తున్న నా మాతృభూమిపైనే జరగాలి అని హసీనా భావోద్వేగానికి లోనయ్యారు. మరణశిక్షను ఎదుర్కొంటున్న మరో సీనియర్ నాయకుడు, మాజీ హోం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్ కూడా ఆమెతో పాటు బంగ్లాదేశ్‌కు వెళ్లే వారిలో ఉన్నారు. 2024లో విద్యార్థులు, సామాన్య ప్రజలు చేపట్టిన భారీ నిరసనల కారణంగా షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన సంగతి విదితమే. సుమారు రెండు దశాబ్దాల పాటు ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తించిన ఆమె, 2024 ఆగస్టులో ప్రాణరక్షణ కోసం భారత్‌కు చేరుకుని రాజకీయ ఆశ్రయం పొందారు. నిరసనల అణిచివేతలో చోటుచేసుకున్న హింసాకాండ, మానవత్వానికి వ్యతిరేకంగా జరిగిన నేరాల ఆరోపణల నేపథ్యంలో బంగ్లాదేశ్‌లోని ప్రత్యేక ట్రైబ్యునల్ 2025 నవంబర్‌లో ఆమెకు మరణశిక్ష విధించింది. ఆమె పార్టీ అయిన అవామీ లీగ్‌పై కూడా నిషేధం విధించారు. అయితే, తనపై నమోదైన కేసులన్నీ రాజకీయ ప్రేరేపితమైనవని హసీనా కొట్టిపారేశారు.

# హైదరాబాద్- బెంగళూరు మధ్య అదనపు సర్వీసులు: ఆర్‌టిసి నిర్ణయం

**హైదరాబాద్, ప్రభాతవార్త, జులై 10:** హైదరాబాద్- బెంగళూరు మధ్య ప్రయాణించే ఐటీ ఉద్యోగులు, వ్యాపారులు, సాధారణ ప్రయాణీకులకు మరింత చేరువయ్యేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి) చర్యలు ప్రారంభించింది. ఆర్‌టిసి ప్రవేశపెట్టిన వినూత్న ఆఫర్‌కి ప్రయాణీకుల నుంచి విశేష స్పందన లభించడంతో హైదరాబాద్, బెంగళూర్ రూట్లలో ఆర్‌టిసి బస్సు సర్వీసు స్టాపింగ్‌ల సంఖ్యను పెంచడంతోపాటు, బెంగళూరు వెళ్లే ప్రయాణీకులకు నగరంలో ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని కల్పించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని సంస్థ ప్రకటించింది. బెంగళూరుకు ఆర్‌టిపి బస్సు టికెట్ బుక్ చేసుకున్న ప్రయాణీకులు, హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాల నుండి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ రూట్లో నడిచే పుష్పక్ ఈ-సిటీ ఎసి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. బెంగళూరు ప్రయాణ టికెట్ చూపించి ఈ ఉచిత సౌకర్యాన్ని పొందవచ్చని సంస్థ తెలిపింది.

ఆర్‌టిసి యాజమాన్యం తీసుకున్న ఈ సరికొత్త నిర్ణయం వల్ల ప్రయాణీకులకు ఆర్థిక భారం తగ్గడమే కాకుండా,ప్రయాణం మరింత సులువైందని, దీని ఫలితంగా ప్రతిరోజూ అదనంగా 60 నుండి 70 టికెట్లు బుక్ అవుతున్నట్టు సంస్థ వెల్లడించింది. ప్రయాణీకుల రద్దీతోపాటు డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్-బెంగళూర్ మధ్య బస్ స్టాపింగ్‌లను సంస్థ భారీగా పెంచింది. రద్దీకి అనుగుణంగా అదనపు సర్వీసులను నడపాలని ఆర్‌టిసి ఎండీ నాగిరెడ్డి అధికారులను ఆదేశించారు. "ప్రయాణీకుల సౌకర్యార్థం, వారి సురక్షి త ప్రయాణమే ధ్యేయంగా టిజిఎస్‌ఆర్‌టీసీ నిరంతరం కొత్త ఆలోచనలతో ముందుకు సాగుతోందని ఆర్‌టిసి ఎండీ వై నాగిరెడ్డి తెలిపారు. బెంగళూరు ప్రయాణీకుల కోసం ప్రవేశపెట్టిన ఉచిత పుష్పక్ ఎసి కనెక్టివిటీకి వస్తున్న ఆదరణ చాలా సంతోషాన్నిస్తోందని, ఈ సదుపాయాన్ని ప్రయాణీకులందరూ మరింతగా సద్వినియోగం చేసుకోవాలని నాగిరెడ్డి కోరారు.

# క్రికెట్‌తో విడదీయరాని బంధం

## మెల్‌బోర్న్ గ్రౌండ్‌లో క్రికెటర్లతో ప్రధాని మోడీ భేటీ



**మెల్‌బోర్న్,జులై 10:** ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా భారతప్రధాని నరేంద్రమోడీ మెల్‌బోర్న్‌లోని ప్రముఖ మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌ను సందర్శించి యువ క్రికెటర్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన భారత్-ఆస్ట్రేలియా మధ్య క్రీడా సంబంధాలను మరింత బలోపేతం చేసే ఇండియా-ఆస్ట్రేలియా స్పోర్ట్స్ కొలాబరేషన్ రోడ్‌మ్యాప్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఎంసిజిలో ప్రసంగించిన ప్రధాని మోడీ మాట్లాడుతూ, ప్రతి భారతీయుడికి ఈ స్టేడియంలో అడుగుపెట్టడం రెండు భావోద్వేగాలను కలిగిస్తుందని అన్నారు. ఒకటి భారత్‌ఆస్ట్రేలియా క్రికెట్ మ్యాచ్ ఉత్సాహం కాగా, మరొకటి రెండు దేశాల్లోనూ క్రికెట్ కేవలం ఆట మాత్రమే కాకుండా ప్రజల అభిమానం, భావోద్వేగంగా మారిందనే విషయాన్ని గుర్తుచేస్తుందని చెప్పారు. అయితే ఈ రోజు చివరి ఓవర్ ఉత్కంఠ లేదని, ఆటపై ఆనందం, రెండు దేశాలస్నేహం, భవిష్యత్‌ఛాంపియన్ల ఉత్సాహం మాత్రమే కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథనీ అల్బనీస్ సమక్షంలో ఇండియా-ఆస్ట్రేలియా స్పోర్ట్స్ కొలాబరేషన్ రోడ్ మ్యాప్‌ను ప్రారంభించిన ప్రధాని మోడీ, ఈ కార్యక్రమం ద్వారా కేవలం క్రికెట్‌కే పరిమితం కాకుండా ఇతర క్రీడల్లో కూడా ఇరు దేశాలు కలిసి పనిచేస్తాయని తెలిపారు.

ఈ సహకారంలో భాగంగా క్రీడా శిక్షణ, స్పోర్ట్స్ సైన్స్, ఆధునిక క్రీడా సాంకేతికత, ప్రతిభ అభివృద్ధి, క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి వంటి రంగాల్లో పరస్పర సహకారం పెంచనున్నట్లు వెల్లడించారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథనీ అల్బనీస్‌తో తన ప్రతి భేటీలోనూ క్రికెట్ సహజంగానే చర్చకు వస్తుందని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

అహ్మదాబాద్‌లోని స్టేడియాన్ని ఇద్దరూ కలిసి సందర్శించిన విషయాన్ని గుర్తు చేశారు. మెల్‌బోర్న్‌లో కూడా మాజీ క్రికెట్ దిగ్గజాలు స్టీవ్ వా, లిసా స్థాలేకర్ సమక్షంలో ఉండటం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ, ఆ దేశ ప్రతిపక్ష నాయకుడు అంగస్ టేలర్‌ను కూడా కలిశారు. ఈ సందర్భంగా భారత్-ఆస్ట్రేలియా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై చర్చించారు. భారత్‌తో సంబంధాలను మరింత విస్తరించేందుకు ఆస్ట్రేలియాలోని ప్రధాన రాజకీయ పార్టీల నుంచి కూడా విస్తృత మద్దతు ఉందని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

# నాటో సదస్సులో ప్రపంచ నేతలకు ఎర్డోగన్ వినూత్న కానుక



## నేతల పేర్లు చెక్కిన రివాల్వర్లు బహూకరణ

**అంకారా,జులై 10:** నాటో సదస్సు ముగిసిన అనంతరం టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్ ప్రపంచ దేశాల నేతలకు ఊహించని విధంగా ప్రత్యేక కానుక అందించారు. ప్రతి నాయకుడికి వారి పేర్లు చెక్కిన పురాతన నమూనా రివాల్వర్‌ను చెక్క పెట్టెలో బహూకరించారు. ఆయుధంతో పాటు కొన్ని బుల్లెట్లు కూడా అందించడంతో ఈకానుక అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. టర్కీ రక్షణ పరిశ్రమ సామర్థ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఎర్డోగన్ ఈబహుమతిని ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఈ రివాల్వర్ 1990లలో టర్కీ ప్రభుత్వ ఆయుధ తయారీ సంస్థ ఎంకెఇ తయారుచేసిన అరుదైన "గుముసాయ్ 357 మాగ్నమ్" మోడల్‌గా గుర్తించారు. ప్రతి రివాల్వర్‌ను ప్రత్యేకంగా తయారు చేసిన చెక్క పెట్టెలో ఉంచారు. పెట్టెపై టర్కీ జాతీయ పతాకంతోపాటు నాటో లోగోను ముద్రించారు. మా దేశంలో తయారైన తొలి రివాల్వర్‌తరహా తుపాకి అనే శాసనాన్ని టర్కిష్, ఆంగ్లభాషల్లో పొందుపరిచారు. ఆయుధంతో పాటు బుల్లెట్లు, ఎగుమతి నిబంధనల నుంచి మినహాయింపు ఉన్నట్లు తెలిపే పత్రాన్ని కూడా అందించారు. అనేక దేశాల్లో ఆయుధాల రవాణాపై కఠిన నిబంధనలు ఉండటంతో రివాల్వర్లను వెంటనే తరలించడం సాధ్యపడలేదు. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, జర్మనీ చాన్స్‌లర్ ఫ్రెడ్రిక్ మెర్జ్, నెదర్లాండ్స్ ప్రధాని రాబ్ జెట్టెన్‌లకు అందించిన రివాల్వర్లు ప్రస్తుతం అంకారాలోనే భద్రపరిచినట్లు సమాచారం. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ మాట్లాడుతూ, తమ పేర్లు చెక్కిన రివాల్వర్, శుభ్రపరిచే కిట్‌తోపాటు బుల్లెట్లుకూడా అందించారని తెలిపారు.స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ ప్రతినిధి మాట్లాడుతూ, అన్ని దేశాధినేతలకు ఒకే తరహా రివాల్వర్‌ను వారి పేర్లతో అందించినట్లు వెల్లడించారు.స్లోవాకియా అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రిని తనకు అందిన రివాల్వర్‌ను విమాన ప్రయాణంలోనే మీడియాకు చూపించారు. ఈ బహుమతి కారణంగా వివిధ దేశాల భద్రతా బృందాలు, కస్టమ్స్ అధికారులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సి వచ్చింది. బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ తన రివాల్వర్‌ను బ్రస్సెల్స్ విమానాశ్రయ పోలీసులకు అప్పగించారు. పోలాండ్ అధ్యక్షుడు కరోల్ నవ్రోకీకి అందిన రివాల్వర్ వార్సా విమానాశ్రయంలో కస్టమ్స్ అనుమతులకోసం నిల్వలో ఉంది.

నెదర్లాండ్స్, స్వీడన్ ప్రధానుల కార్యాలయాలు తమ రివాల్వర్లను అంకారాలోని రాయబార కార్యాలయాలకు తరలించినట్లు వెల్లడించాయి. నెదర్లాండ్స్‌కు చెందిన రివాల్వర్‌ను పనిచేయకుండా మార్చనున్నట్లు, స్వీడన్‌కు చెందినది దిగుమతి అనుమతుల కోసం వేచిఉన్నట్లు తెలిపాయి.ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీకి అందిన రివాల్వర్‌ను రోమ్‌లోని ప్రభుత్వ భవనం పలాజ్జో చిగిలో ఇతరఅధికారిక బహుమతులతో పాటు భద్రపరిచారు. యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ దర్ లేయెన్ తనకు అందిన రివాల్వర్‌ను సైనిక మ్యూజియంకు విరాళంగా ఇవ్వాలని నిర్ణయించగా, గ్రీస్ నాయకుడు దానిని ఏథెన్స్ యుద్ధ మ్యూజియంకు అందజేయనున్నట్లు ప్రకటించారు.కెనడా ప్రధాని మార్క్ కార్నీ సరదాగా స్పందిస్తూ, నేను ఇచ్చిన మేపుల్ సిరప్‌తో పోలిస్తే టర్కీ కానుక చాలా భిన్నంగా ఉందన్నారు.

# ఆర్టీఐ నిబంధనల అమలులో నిర్లక్ష్యం సహించం

## ఉల్లంఘనలకు పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తప్పవు

### ఎపి రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ సజ్జా శ్రీనివాసరావు

**విజయవాడ,జులై 10, ప్రభాతవార్తప్రతినిధి:** సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) లోని సెక్షన్ 4(1) (బి) నిబంధనలను ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో తప్పనిసరిగా అమలుచేయాలని, చట్టం అమలులో ఎలాంటి నిర్లక్ష్యాన్నీ సహించబోమని రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ సజ్జా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఆర్టీఐ చట్టంఅమలుపై శుక్రవారం విజయవాడ రూరల్‌లోని గొల్లపూడిలో ఉన్న పలు ప్రభుత్వ కార్యాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం, గొల్లపూడి గ్రామపంచాయతీ కార్యాలయంతోపాటు డైరెక్టరేట్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ కార్యాలయం, బందరు రోడ్డులోని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) కార్యాలయాలను సందర్శించి, ఆర్టీఐ చట్టం అమలు తీరును పరిశీలించి, సంబంధిత అధికారులతో సమీక్షి ంచారు. ఆయా కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ఆర్టీఐ రిజిస్టర్లు, రికార్డులు, పౌరులకు అందిస్తున్న సమాచార వ్యవస్థను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు.ఈ సందర్భంగా ప్రధాన సమాచార కమిషనర్ మాట్లాడుతూ.. ఆర్టీఐ చట్టం ప్రభుత్వ ఆఫీసుల్లో ఏవిధంగా అమలు అవుతుందో పరిశీలనలో భాగంగా తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. గత కొంతకాలంగా రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఆర్టీఐ నిబంధనలు సక్రమంగా అమలు కావడం లేదంటూ కమిషన్‌కు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లు మొదటి అప్పీలేట్ అథా రిటీల వివరాలతో కూడిన నేమ్ బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, జాబ్ చార్టులు, సిటిజన్ చార్టర్లను ప్రదర్శించకపోవడం వంటి లోపాలను రాష్ట్ర వ్యాప్తంగా గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ పరిస్థితులను సరిదిద్దేందుకు రాష్ట్ర సమాచార కమిషన్ ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని తెలిపారు. ఇందులో భాగంగా సమాచార కమిషనర్లు ఒక్కొక్కరికి రెండుజిల్లాల చొప్పున బాధ్య తలు అప్పగించి, ప్రభుత్వ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించేలా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఆర్టీఐచట్టంపై పూర్తి అవగాహన పెంపొం దించడం, చట్టాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేయించడమే ఆకస్మిక తనిఖీల ప్రధాన ఉద్దేశంఅని ఆయన తెలిపారు. తనిఖీల్లో నిర్లక్ష ్యం, విధి నిర్వహణలో లోపాలులేదా నిబంధనల ఉల్లంఘనలు గుర్తిస్తే సంబం ధిత అధికారులపైచట్టప్రకారం కఠిన చర్యలుతీసుకుంటామని హెచ్చరించారు.

దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ దేవాదాయ శాఖలో ఆర్టీఐ చట్టం అమలు తీరును రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ కు వివరించారు. అలాగే గొల్లపూడి గ్రామ పంచాయతీ, డైరెక్టరేట్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయాల్లో సంబంధిత అధికారులు అందించిన వివరాలు, రికార్డులను పరిశీలించిన

# అవినీతి అధికారులను టార్గెట్ చేస్తున్న సైబర్ నేరగాళ్లు

## ఎసిబి పేరిట బెదరింపులకు పాల్పడి రూ. లక్షల్లో వసూళ్లు

**హైదరాబాద్, జులై 10 ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్ల ట్రెండ్ మార్చారు. ఇప్పటివరకు చేస్తున్న నేరాలకు భిన్నంగా ఎసిబి కేసుల్లో వున్న వారు, ఎసిబి దాడులు జరిగిన సర్కారీ విభాగాల్లో పనిచేస్తున్న వారిని టార్గెట్ చేస్తూ అందినంత దోచుకుంటున్నారు. వీటిపై అప్రమత్తంగా వుండాలని ఓవైపు ఎసిబి, మరోవైపు సైబర్ క్రైం పోలీసులు హెచ్చరిస్తున్నా మోసపోతున్న వారి సంఖ్య ఆగడంలేదు. అయితే కొన్నిసార్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తుండగా ఇంకొన్ని సార్లు మౌనంగా వుంటుండం సైబర్ నేరగాళ్లకు ఊతం ఇస్తోంది.గతంలో ఎసిబి పేరు చెప్పి కొందరు నేరగాళ్లు రెవెన్యూ, అబ్కారీ, రిజిస్ట్రేషన్ విభాగాల అధికారులు, సిబ్బందిని బెదిరించి వసూళ్లకు పాల్పడిన ఘటనలు అనేకం వున్నాయి. మీడియాలో ఎక్కడైనా అవినీతి, అక్రమాలపై వార్తలు రాగానే ఈ తరహా నేరాలకు పాల్పడే నేరగాళ్లు రెచ్చిపోయి ఆయా విభాగాల అధికారులకు ఫోన్‌లు చేసి తాము ఎసిబి అధికారులమని బెదిరించి అందినంతా దండుకునే వారు. దీనిపై ఎసిబి ఎన్ని హెచ్చరికలు చేసినా పెద్దగా ప్రయోజనం వుండడడం లేదు. కొన్నిసార్లు ఇలాంటి నేరాలకు పాల్పడిన వారు పోలీసులకు పట్టుబడిన ఉదంతాలు వున్నా ఇప్పటికీ కొన్నిచోట్ల ఈ తరహా నేరాలు సాగుతూనే వున్నాయి. అయితే తాజాగా సైబర్ నేరగాళ్లు సర్కారీ విభాగాల్లో అక్రమార్కులుగా పేరొందిన వారిని బెదిరించి వసూళ్లకు పాల్పడడం పెరిగి పోయింది. చేర్యాల తహసీల్దార్ ఇటీవలే ఎసిబికి పట్టుబడగా దీని తరువాత ఎసిబి అధికారులు ఆ కార్యాలయంతో పాటు అక్కడ పనిచేసే అధికారులు, సిబ్బంది, పలువురు అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ఎసిబి సోదాలు చేర్యాల తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులను హడలెత్తించగా దీనిని సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మలచుకుని సొమ్ముచేసు కున్నారు. ఎసిబి దాడుల తరువాత ఈ కార్యాలయంలో ఆర్‌ఐగా పనిచేస్తున్న ఓ అధికారికి ఎసిబి అధికారుల పేరిట సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి మీపైనా ఇంకా చాలా మందిపైనా అనేక ఆరోపణలు వున్నాయి...మీపై కేసు నమోదు కాకుండా వుండాలంటే వెంటనే మేము సూచించిన బ్యాంకు ఖాతాకు లక్ష రూపాయలు పంపాలని లేకుంటే నెక్స్‌ట్ మిమ్మల్నే అరెస్టు చేయాల్సి వుంటుందని బెదిరించారు.

దీంతో బెదిరిపోయిన సదరు అధికారి సైబర్ నేరగాళ్లు చెప్పినట్లే నిమిషాల వ్యవధిలో లక్ష రూపాయలు నేరగాళ్లు సూచించిన బ్యాంకు ఖాతాకు బదిలీ చేశారు. డబ్బులు పంపిన తరువాత తనకు ఫోన్ చేసిన వ్యక్తికి ఫోన్ చేసి, తనను ఏమీ అనవద్దని, మీరు చెప్పినట్లే చేశానని చెప్పాలని ఫోన్ చేయగా అది స్విచాఫ్‌గా తేలింది. మరోసారి చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించిన సదరు అధికారి వెంటనే సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేబట్టారు. చేర్యాలతో పాటు మరో మూడుచోట్ల ఇ టువంటి ఘటనలు జరిగినట్లు సైబర్ క్రైం పోలీసుల దృష్టికి వచ్చింది. అయితే ఈ ఘటనలపై ఫిర్యాదులు అందక పోవడంతో సైబర్ క్రైం పో లీసులు అంతర్గతంగా విచారణ చేబట్టారు. ఈ తరహా ఘటనలపై సర్కారీ విభాగాల అధికారులు అప్రమత్తంగా వుండాలని సైబర్ క్రైం పోలీసులు కోరుతున్నారు.

## అంగన్‌వాడీల్లో భర్తీ ప్రక్రియ ప్రారంభం

### వివిధ జిల్లాల్లో నోటిఫికేషన్లు విడుదల

**హైదరాబాద్, జూలై 10, ప్రభాతవార్త :** తెలంగాణలోని నిరుద్యోగ మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలను కల్పించనుంది. ఇందుకు గాను తాజాగా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో 15,982 అంగన్‌వాడీ పోస్టుల భర్తీప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో భాగంగా నిజామాబాద్‌జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అంగన్‌వాడీ టీచర్, అంగన్ వాడీ ఆయా ఖాళీల భర్తీకి అధికారిక నోటిఫికేషన్లు వెలువడ్డాయి. నిజామాబాద్ జిల్లాలోని ఐదు సమగ్ర శిశు అభివృద్ధి సేవల ప్రాజెక్టుల పరిధిలో 179 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నిజామాబాద్‌తో పాటు ములుగు, నల్గొండ, గద్వాల, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, కామారెడ్డి, పెద్దపల్లి, కొత్తగూడెం జిల్లాల్లో కూడా ఈ నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. ఈ నోటిఫికేషన్లలో పేర్కొన్న వివరాలు ప్రకారం దరఖాస్తుదారులు తప్పకుండా ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఉండాలి. స్థానికంగా ఇంటర్ అభ్యర్థులు లేకపోతే 10వ తరగతి చదివిన వారికి అవకాశం కల్పించనున్నారు. అలాగే ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 18 నుండి 35 సంవత్సరాల మధ్యఉండాలి. ప్రధానంగా ఖాళీఉన్న కేంద్రం పరిధిలోని స్థానిక వివాహిత మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ ద్వారా 100 మార్కులకు ఈ ఎంపిక జరుగుతుంది. ఇందులో ఇంటర్ మార్కులకు 70, అనాథలకు 10, వితంతువులకు 5, దివ్యాంగులకు 5 వెయిటేజీతోపాటు 10 మార్కులకు ఇంటర్వ్యూ ఉంటుందని వెల్లడించింది.

## నేడు విజయవాడలో మెగా జాబ్ మేళా

**విజయవాడ, జులై 10, ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో నిరుద్యోగ మైనారిటీ యువత కోసం రాష్ట్రస్థాయి మెగా జాబ్ మేళాను నేడు నిర్వహిస్తున్నట్లు మైనారిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇస్లాం పేటలోని షాజహూర్ ముసాఫిర్ ఖానాలో ఉదయం 9 గంటల నుండి జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. నిరుద్యోగమైనారిటీ యువత కోసం, ఉద్యోగ, ఉపాధి కల్పనకు ప్రఖ్యాతిగాంచిన 60 నుండి 70 మల్టీ నేషనల్ సంస్థలు, డోమెస్టిక్ కంపెనీలుపాల్గొంటున్నట్లు మంత్రి తెలిపారు. ఐటి,బ్యాంకింగ్, ఫైనాన్స్, హెల్త్ కేర్, లాజిస్టిక్స్, రిటైల్ తదితర రంగాలలో వివిధ స్థాయిలలో 2500 నుండి 3500 మందికి ఉపాధిఅవకాశాలుకల్పించడమే జాబ్ మేళా ముఖ్య ఉద్దేశమని తెలిపారు. 10వ తరగతినుండి పీజీ దాకా చదివిన నిరుద్యోగులంతా పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఫరూక్ పిలుపు నిచ్చారు.

## వరుస ఓటములపై మంత్రి అజారుద్దీన్ అసంతృప్తి

**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న భారత జట్టుకు వరుస ఓటములతో పరాభవం పాలవుతోంది. ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో భారత క్రికెట్ జట్టు వరుసగా మూడోఓటమితో సిరీస్‌ను చేజార్చుకుంది. కాగా ఈ వరుస ఓటములపై మాజీ భారత కెప్టెన్, తెలంగాణ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఐపీఎల్ మైండ్ సెట్ నుండి భారత బ్యాటర్లు ఎంత త్వరగా బయట పడితే అంత మంచిదని అన్నారు. ఇంగ్లాండ్‌తో ఆడటం అనేది పూర్తిగా భిన్నమైన విషయమని, ఐపిఎల్‌లో ఆడినట్లు ప్రతి బంతిని స్టేడియం దాటించడానికి ఇక్కడ కుదరదని స్పష్టం చేశారు.